
ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపర్ పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

కర్నూలు, డోన్, ఆత్మకూరు, కల్లూరు	- 99854 09260
కర్నూలు, కోడుమూరు, నందికొట్కూరు	- 9985411379
ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు	- 9985171793
నంద్యాల, పాణ్యం, ఆళ్ళగడ్డ, బనగానపల్లె	- 9985411377

నంద్యాల జిల్లాను వర్షం వెంటాడుతోంది. ఎడతెరిపి లేని వానలతో పంటలు మునిగిపోతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి.. రాకపోకలు స్తంభిస్తున్నాయి.. రోడ్లు కోతకు గురవుతున్నాయి.. పంటలు నష్టపోతున్నా అధికారులు స్పందించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని పలు మండలాల్లో శనివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. జిల్లాలో అత్యధికంగా రుద్రవరం మండలంలో 40.2ఎంఎం వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా వెలుగోడు మండలంలో 1.0 ఎంఎం వర్షపాతం నమోదైంది.



వాగులో ఇరుక్కుపోయిన బస్సు

వీడని వర్షం తగ్గని వరద

- జిల్లాలో పలు మండలాల్లో భారీ వర్షం
- 221.4 ఎంఎం వర్షపాతం నమోదు
- పంట పొలాల్లో తగ్గని వరద
- కోతకు గురవుతున్న రోడ్లు
- స్తంభించిన రాకపోకలు
- మరో మూడు రోజుల పాటు మోస్తరు వర్షాలు

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో పలు మండలాల్లో శనివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ప్రధానంగా నల్లమలలో కురిసిన భారీ వర్షంతో పాలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మహానంది ప్రాంతంలోని నల్లమలలో కురిసిన భారీ వర్షం వల్ల వరద నీరు పాలేరుకు చేరుకుని అక్కడి నుంచి నంద్యాల పట్టణంలోని చామకాల్వ మీదుగా కుందూ నదిలో కలుస్తుంది. దీంతో పట్టణ నడిబొడ్డున ఉన్న చామకాల్వ ఉధృతి పెరిగింది. జిల్లాలో అత్యధికంగా రుద్రవరం మండలంలో 40.2ఎంఎం వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా వెలుగోడు మండలంలో 1.0 ఎంఎం నమోదైంది. మహానంది 29.2, సంజామల 25.2, నంద్యాల పట్టణం 19.6, ఉయ్యాలవాడ 19.4, గోస్పాడు 15.0, శిరువెళ్ల 11.0, ఆళ్లగడ్డ 10.0, కొత్తపల్లె 8.6, నంద్యాల మండలం 8.6, కోవెలకుంట్ల 6.2, దొర్నిపాడు 4.8, కొలిమిగుండ్ల 4.6, కొలిమిగుండ్ల 4.6, చాగలమర్రి 4.6ఎంఎం వర్షపాతం నమోదైంది.



ఉధృతంగా ప్రవహిస్తున్న చామకాల్వ



మహానందిలో నేలకూలిన భారీ చింతచెట్టు

రుద్రవరంలో భారీ వర్షం

రుద్రవరం: రుద్రవరం మండలంలో శనివారం 40.2 మిల్లీమీటర్ల మేర వర్షపాతం నమోదైంది. భారీ వర్షానికి వాగులు వంకలు పొంగి ప్రవహించాయి. చిలకలూరు, పేరూరు ఎర్రగుడిదిన్నె గ్రామాల సమీపంలోని వక్కిలేరు వాగు ఉధృతంగా ప్రవహించింది. చిలకలూరు గ్రామ సమీపంలో వక్కిలేరు వాగు పొంగి ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. రుద్రవరం - శిరివెళ్ల మధ్యలో ఉన్న వాగు పొంగి ప్రవహించడంతో కోడిపిల్ల వాగు సమీపంలో వాహనాలు నిలిచిపోయాయి.



రుద్రవరంలో..

మహానందిలో కుండపోత వర్షం

- ఉధృతంగా ప్రవహించిన పాలేరువాగు

మహానంది: మహానంది మండలంలో శనివారం తెల్లవారుజామున కుండపోత వర్షం కురిసింది. దీంతో మహానంది దేవస్థానం పాత కార్యాలయం భవనం ఎదుట వందేళ్ల నాటి భారీ చింత చెట్టు నేలకూలింది. అదేవిధంగా నాలుగు విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మహానంది సమీపంలోని పాలేరువాగు ఉధృతంగా ప్రవహించింది. లోలెవెల్ వంతెనపై వరద నీరు పొంగి ప్రవహించడంతో మహానంది నుంచి గాజులపల్లి వైపు రహదారిలో కొన్ని గంటల పాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇదే రహదారిలో ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ కళాశాల, గాజులపల్లి రైల్వే స్టేషన్ ఉండటంతో అటు వైపు వెళ్లే విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. పాలేరువాగును తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ మహమ్మద్‌దౌలా, పంచాయతీరాజ్ కార్యదర్శి కలువ భాస్కర్‌తోపాటు పోలీసులు పరిశీలించారు.

వాగులో ఇరుక్కుపోయిన బస్సు

ఉయ్యాలవాడ: మండలంలోని రూపనగుడి గ్రామ చెరువు అలుగు ఉగ్రరూపం దాల్చింది. దీంతో కోవెలకుంట్ల - జమ్మలమడుగు పట్టణాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తెల్లవారుజామున ఓ ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన బస్సు వాగులో ఇరుక్కుపోయింది. తహసీల్దారు ప్రసాద్‌బాబు, ఎస్‌ఐ రామిరెడ్డి స్పందించి ప్రయాణికులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. ప్రయాణికులకు అధికారులు టిఫిన్ ఏర్పాటు చేశారు. అలాగే వరి పంట నీట మునిగింది.



క్రెయిన్ సాయంతో బస్సును బయటకు తీస్తున్న అధికారులు



నేలంపాడు గ్రామంలో ప్రవహిస్తున్న వరద నీరు



ఉధృతంగా ప్రవహిస్తున్న పాలేరు వాగు



మహానందిలో నేలకూలిన విద్యుత్ స్తంభం

చాగలమర్రి, : మండలంలో గొట్లూరు, నేలంపాడు గ్రామాల సమీపంలోని పంట పొలాలు నీట మునిగాయి. నేలంపాడు గ్రామంలో వరద నీరు తగ్గకుండా ప్రవహిస్తుండటంతో గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. గోట్లూరు, నేలంపాడు, రాంపల్లె, జంగాలపల్లె, కొట్టాలపల్లె, రాజోలి గ్రామాల సమీపంలోని పొలాల్లో మూడు రోజుల నుంచి వరద నీరు తగ్గలేదు. దీంతో బెండ, మినుము, మొక్కజొన్న, కంది, జూట్ పంటలు నీట మునిగి కుళ్లిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో 1,800 ఎకరాల దాకా పంటలు దెబ్బతిన్నాయన్నారు. గొట్లూరు గ్రామంలోని 400 ఎకరాల్లో మొక్కజొన్న, 50 ఎకరాల్లో బెండ, 30 ఎకరాల్లో కంది, రాజోలిలో 50 ఎకరాల్లో వరి పంటలు నీట మునిగి నష్టం వాటిల్లింది. వెల్లాల క్షేత్ర సమీపంలోని దేవాలయం వద్దగల వంక పొంగి ప్రవహించడంతో ఆ రహదారి వెంట రాకపోకలు స్తంభించాయి. చాగలమర్రి నుంచి ప్రొద్దుటూరుకు వెళ్లే ఆర్టీసీ బస్సులు, వాహనదారుల రాకపోకలు నిలిచిపోయాయి.



గొట్లూరు గ్రామంలో నీట మునిగిన పంటలను చూపిస్తున్న రైతులు

బాలికలను వేధిస్తే పోక్సో కేసులు

ఐసీడీఎస్ పీడీ లీలావతి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ లీలావతి

రుద్రవరం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చట్ట రీత్యా నేరమని, బాలికలను వేధిస్తే పోక్సో కేసులు తప్పవని ఐసీడీఎస్ పీడీ లీలావతి హెచ్చరించారు. శనివారం రుద్రవరంలో నిర్వహించిన పౌష్టికాహార వారోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ వారోత్సవాలు సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 16 వరకు కొనసాగుతాయన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లలోపు ఉన్న పిల్లలను లైంగికంగా వేధిస్తే పోక్సో కింద కేసులు నమోదు చేయిస్తామన్నారు. పురుషులకు వివాహ వయసు 21, మహిళలకు 18 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, సీడీపీవో తేజేశ్వరి, సూపర్‌వైజర్ రషీదా బేగం, హెచ్‌ఎం వెంకటరమణ పాల్గొన్నారు.

ఉల్లి రైతులను ఆదుకునేందుకు సీఎం కృషి

• మంత్రి టీజీ భరత్

7

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందాం

రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం బనగానపల్లె మండలం ఇల్లూరు కొత్తపేటలో మంత్రి బీసీ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. మంత్రి విద్యార్థులు, గ్రామ ప్రజలతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. మొక్కలు నాటుదాం, పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ప్రతి నెలా 3వ శనివారం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బనగానపల్లెను ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు కంకణం కట్టుకున్నామన్నారు. బీసీ ఇందిరమ్మ నిత్యం బనగానపల్లెలో తిరుగుతూ మొక్కల సంరక్షణ, ప్లాస్టిక్ నివారణకు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మిట్టపల్లె సర్పంచ్ తులసిరెడ్డి, మాజీ సర్పంచ్ రామిరెడ్డి, డీఈ నాగ శ్రీనివాసులు, వేణుగోపాల్, ఎంఈవో స్వరూప, బాలతిమ్మారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఈవోఆర్డీ బాలాంజనేయులు పాల్గొన్నారు.



ఇల్లూరు కొత్తపేటలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

ఏడుగురు పోలీసులకు పదోన్నతి

కర్నూలు క్రైం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆయా పోలీస్ స్టేషన్‌లలో పని చేస్తున్న ఏడుగురు కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి కల్పిస్తూ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రస్తుత స్థానం	కేటాయించిన జిల్లా
ఎస్.లక్ష్మణ నాయక్	పీసీఆర్, కర్నూలు	నంద్యాల
జి.శ్రీనివాసులు	పత్తికొండ యూపీఎస్	నంద్యాల
వి.బాల రమేష్	కర్నూలు తాలుకా యూపీఎస్	నంద్యాల
యు.అశోక్ కుమార్	ఆదోని వన్‌టౌన్ యూపీఎస్	నంద్యాల
ఎస్.ఖలందర్ షాన్	కర్నూలు వన్ టౌన్ యూపీఎస్	నంద్యాల
ఎస్.గిరిబాబు	కర్నూలు ట్రాఫిక్ పీఎస్	నంద్యాల
బి.పరుశురాం	ఆదోని త్రీటౌన్ యూపీఎస్	నంద్యాల

పదోన్నతి పొందిన ఎంపీడీవోలకు పోస్టింగ్

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవోలుగా పదోన్నతి పొందిన ముగ్గురికి పోస్టింగ్ ఇస్తూ జడ్పీ సీఈవో జి.నాసరరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. డ్వామాలో పని చేస్తున్న టి.క్రిష్ణమోహన్ శర్మను గూడూరు, పాములపాడులో పని చేస్తున్న గాయత్రికి బండిఆత్మకూరు, మహానంది డిప్యూటీ ఎంపీడీవో పి.నాగేంద్రుడిని ఆత్మకూరుకు నియమించారు. పి.దస్తగిరిబాబు, ఎస్.నాగరాజు, రామక్రిష్ణవేణికి ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదు. నంద్యాల జిల్లా అవుకు, కొలిమిగుండ్ల, బనగానపల్లె, కర్నూలు జిల్లా ఓర్వకల్లు, కోసిగి మండలాల్లో ఎంపీడీవో పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఉల్లి రైతుల కన్నీరు తుడిచిన ప్రభుత్వం



నంద్యాల రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఉల్లి రైతుల కన్నీరు తుడిచిందని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ ఎన్‌ఎండీ ఫరూక్, ఎంపీ శబరి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తమ ప్రభుత్వం రైతు సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతోందన్నారు. ఉల్లి పండించిన ప్రతి రైతుకు హెక్టారుకు రూ.50,000 ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించడంతో ప్రభుత్వంపై రూ.100 కోట్లకు పైగా భారం పడుతుందన్నారు. కర్నూలు జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 45.278 ఎకరాల్లో ఉల్లి సాగుచేయగా ఆర్థిక సాయం ద్వారా 24,218 మంది రైతులు లబ్ధిపొందనున్నట్లు వారు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఈ ఏడాది రూ.20000 పెట్టుబడి సాయంగా అందిస్తామన్న హామీ మేరకు మొదటి విడతలో రూ.7000 రైతుల ఖాతాలో జమ చేశారన్నారు. గత ప్రభుత్వ రూ.1670 కోట్ల బకాయిలను కూడా కూటమి ప్రభుత్వం చెల్లించిందన్నారు.

కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి: మంత్రి బీసీ



బనగానపల్లె, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి అని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఉల్లి రైతులపై ముఖ్యమంత్రికి ఉన్న ప్రేమను మరోమారు చాటుకున్నారన్నారు. సీఎం చంద్రబాబు నిర్ణయంతో ఉల్లి రైతులకు భారీ ఊరట కలుగనుందన్నారు. ఈ నిర్ణయం వల్ల ప్రభుత్వానికి అదనంగా రూ.వందకోట్ల భారం పడుతున్నా లెక్కచేయకుండా సాయం అందించారన్నారు. అయినా తమ రాజకీయ పబ్బం గడుపుకునేందుకు వైసీపీ ఉల్లి రైతులను ప్రభుత్వంపై రెచ్చగొడుతోందన్నారు. రైతులు వైసీపీ ఆడే రాజకీయ క్రీడలో చిక్కుకుని బలిపశువులు కావద్దని మంత్రి కోరారు.

శ్రీశైలంలో దసరా మహోత్సవాలకు సిద్ధం: ఈవో



శ్రీశైలం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో ఈనెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జరగబోయే దసరా మహోత్సవాలకు సర్వం సిద్ధం చేసినట్లు దేవస్థానం ఈవో శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆలయ పరిపాలనా భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 22న ఉదయం 9 గంటలకు అమ్మవారి ఆలయ యాగశాల ప్రవేశంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. అక్టోబరు 1వ తేదీ మహర్నవమి రోజున రాష్ట్ర ప్రభుత్వం వారిచే స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాణరెడ్డి హాజరవుతారని తెలిపారు. అక్టోబరు 2న విజయదశమి సందర్భంగా సాయంకాలం నిర్వహించే తెప్పోత్సవంతో ఉత్సవాలు ముగియనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో ఆర్.రమణమ్మ, ఏఈవో హరిదాసు, ప్రజాసంబంధాల అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

8 గేట్లతో శ్రీశైలం రిజర్వాయర్ నీటి విడుదల


శ్రీశైలం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం రిజర్వాయర్‌కు నీటి ప్రవాహం పోటెత్తడంతో ఇంజనీర్లు 8 గేట్లను ఒక్కొక్కటి 10 అడుగుల ఎత్తు మేరకు తెరిచి స్పిల్‌వే గుండా 2,22,032 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. శనివారం సాయంత్రం 6 గంటల సమయానికి డ్యాం నీటిమట్టం 884 అడుగులు ఉండగా నీటినిల్వ సామర్థ్యం 211 టీఎంసీలుగా ఉంది. శ్రీశైలం రెండు జలవిద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి అనంతరం జెన్‌కో అధికారులు 65,890 క్యూసెక్కులు విడుదల చేశారు.



తుంగభద్ర తీరం

సాహిత్యం

మహాత్ముని అడుగుజాడల్లో నంద్యాల గాంధీ పాదముద్రలు



కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నేటితరంలో చారిత్రక స్పృహ తగ్గిపోతోంది. తమ మూలాలను కానీ, తమ ప్రాంత అస్తిత్వం గురించి తెలుసుకోవాలనే ఆసక్తి, జిజ్ఞాస యువతలో కనిపించడం లేదు. తమ ప్రాంతం సామాజికంగా, సాంస్కృతికంగా ఎలా అభివృద్ధి చెందిందో తెలుసుకోవాలంటే...ఆ ప్రాంతాలకు చెందిన కొంతమంది మహనీయుల జీవిత చరిత్రలను అధ్యయనం చేయాల్సి ఉంటుంది. రాయలసీమకే గర్వకారణమైన మచ్చలేని స్వచ్ఛమైన గాంధేయవాది, నంద్యాల ప్రజానీకంచే 'నంద్యాల గాంధీ'గా వినతికెక్కిన స్వాతంత్ర్య సమరయోధుడు కాదర్‌బాద్ నరసింగరావు. ఈ మహనీయుని జీవిత చరిత్రే 'నంద్యాల గాంధీ' పుస్తకం. శతాధిక గ్రంథ రచయిత, విద్వాన్ గొట్టిముక్కల సుబ్రహ్మణ్యశాస్త్రి ఈ పుస్తకాన్ని రాశారు. నంద్యాల గాంధీని తెలుసుకోవాలంటే 1888-1963 మధ్య కాలంలో నంద్యాల సామాజిక, సాంస్కృతిక వైవిధ్యాన్ని తెలుసుకోవడమే అవుతుంది. నరసింగరావు 1920-1934 వరకు నంద్యాల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులుగా సుదీర్ఘకాలం పనిచేశారు. నిరంతరం గాంధీజీ అడుగుజాడల్లో నడుస్తూ 'స్వచ్ఛమైన గాంధేయవాది'గా ఆయన కీర్తి గడించాడు. ఆయన సమాజానికి చేసిన సేవలకు, రాజకీయాల్లో ఆయన నెరపిన పెద్దరికానికి ముగ్ధుడైన ఆంధ్రా తిలక్ గాడిచర్ల హరిసర్వోత్తమరావు నరసింగరావుకు 'నంద్యాల గాంధీ' అని నామకరణం చేశారు.

కాదర్‌బాద్ నరసింగరావు తన కృషిని కేవలం స్వాతంత్ర్య పోరాటానికే పరిమితం చేయలేదు. సామాజిక సేవల వైపు కూడా అడుగులు వేశాడు. నంద్యాలలో విద్యావ్యాప్తికి నాలుగు ఎకరాల సొంత భూమిని విరాళంగా అందజేశారు. నేడు ఆ పాఠశాలనే 'కాదర్‌బాద్ నరసింగరావు స్మారక పురపాలక ఉన్నత పాఠశాలగా ఎందరో విద్యార్థులకు చదువుల బాట పట్టిస్తోంది. అణగారిన వర్గాల పిల్లల అభ్యున్నతికి 1947లో 300 మందికి వసతి కల్పించే విధంగా హరిజన హాస్టల్‌ను, పేద బాలికల కోసం ప్రత్యేక హాస్టల్‌ను ఆయన నెలకొల్పారు. మరోవైపు నాణ్యమైన విత్తనాలు, సాగునీటి సౌకర్యం, గిట్టుబాటు ధరలు కల్పించడం, కందూనదిపై వారధి నిర్మాణం వంటి అనేక కార్యక్రమాలు చేపట్టారు. గాడిచర్ల హరిసర్వోత్తమరావుతో కలిసి 'శ్రీబాగ్ ఒడంబడిక'ను రూపొందించడంలో కూడా ఆయన ప్రముఖపాత్ర పోషించారు. ఆనాటి నంద్యాల ప్రజల జీవన స్థితిగతులు, సాంఘిక జీవనం, స్వాతంత్ర్య ఉద్యమ ప్రభావం వంటి పలు చారిత్రక అంశాలను తెలుసుకోవడానికి 'నంద్యాల గాంధీ' పుస్తకం ఒక దిక్సూచిగా నిలుస్తుంది. ఇది అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాల్లో లభిస్తోంది.



- డాక్టర్ నీలం వెంకటేశ్వర్లు, సాహితీ విమర్శకులు, నంద్యాల

భాష కోసం పాతికేళ్లుగా ఉద్యమాలు



జేఎస్ఆర్‌కే శర్మ

- మాతృభాషా వికాసానికి 200పైగా రథయాత్రలు
- కర్నూలులో భరతమాత ఆలయ నిర్మాణంలో ముఖ్య భూమిక
- తెలుగుతల్లి, శ్రీకృష్ణరాయల విగ్రహాల స్థాపనకు కృషి
- జిల్లా సాహిత్యరంగంలో 'తెలుగు శర్మ' ప్రత్యేక గుర్తింపు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యంలో అనేక సందేహాలను నివృత్తి చేసుకునేందుకు జిల్లా సాహితీవేత్తలు ఆయన్ను ఆశ్రయిస్తారు. మాతృభాషకు సంబంధించిన ఏ అంశంలోనైనా సందేహం వస్తే భాషావేత్తలు ఆయననే సంప్రదిస్తారు. ఎందుకంటే మాతృభాష, సాహిత్యం ఆయన తన రెండు కళ్లుగా భావిస్తూ, నిత్యం అందులోనే మునిగితేలుతుంటారు. అంతేకాదు, తల్లిభాషకు రక్షణ చత్రం పట్టేందుకు 'తెలుగు భాషా వికాస ఉద్యమం' సంస్థను నెలకొల్పి, ఆ సంస్థ పేరుతో గత పాతికేళ్లుగా ఉద్యమాలు చేస్తూనే ఉన్నారు. 200పైగా రథయాత్రలు చేపట్టి రాయలసీమలోని జిల్లాల్లో పర్యటనలు చేశారు. 300పైగా పుస్తకాలకు వ్యాసాలు, సమీక్షలు, పీఠికలతో పాటూ స్వయంగా అనేక పుస్తకాలు రాసి వెలువరించారు. కర్నూలు నగరంలో దేశభక్తితో భరతమాత ఆలయాన్ని దేశంలోనే మొట్టమొదటిసారిగా నిర్మించి ప్రజల్లో దేశభక్తిని చాటి చెప్పారు. నగరంలో తెలుగుతల్లి, శ్రీకృష్ణదేవరాయల విగ్రహాల స్థాపనలోనూ ముఖ్యభూమిక పోషించారు. సుదీర్ఘ ఆధునిక జిల్లా సాహిత్య రంగంలో తనకుంటూ ఒక ముద్ర వేసుకున్న ఆయనే జగర్లపూడి సీతారామకృష్ణ శర్మ. సాహితీవేత్తలంతా ఆయన్ను జేఎస్ఆర్‌కే శర్మ అని పిలుచుకున్నా...దివంగత డాక్టర్ సి.నారాయణరెడ్డి మాత్రం ఆయనకు 'తెలుగు శర్మ' అని నామకరణం చేశారు. భాషా, సాహిత్యంపై ఆయనకు ఉన్న మమకారానికి గుర్తుగా ఏనాడో డాక్టర్ సినారె పెట్టిన పేరే...నేటి జిల్లా సాహిత్యలోకానికి ఆయన తెలుగు శర్మగానే పరిచితులుగా నిలుస్తున్నారు.


ప్రకాశం జిల్లాలోని తర్లుపాడు గ్రామానికి చెందిన జగర్లపూడి పుల్లయ్య శర్మ, రాజ్యలక్ష్మి దంపతులకు ఏకైక సంతానంగా 1944 మార్చి 25న జన్మించిన జేఎస్ఆర్‌కే శర్మ ప్రాథమిక విద్య ఆ గ్రామంలోనే చదువుకున్నారు. కనిగిరిలో 1962లో టీచర్ ట్రైనింగ్ కోర్సు పూర్తి చేసి 1963 డిసెంబరులో ఉపాధ్యాయ వృత్తిలో చేరారు. కర్నూలు జడ్పీలో నియామక ఉత్తర్వులు తీసుకుని పత్తికొండ సమితిలోని కొత్తపల్లి ఎరుకల గుడిసెలు ప్రాంతంలో ఉపాధ్యాయునిగా చేరారు. అయితే పాఠశాలలో అన్ని కులాల వారిని సమానంగా కూర్చొబెట్టడం కూడా తలనొప్పి అయింది. అయితే అందులో తన మాటతీరుతో విజయం సాధించారు. పత్తికొండ సమితిలో 15 ఏళ్లుగా ఉపాధ్యాయులకు ప్రొబేషన్, రెగ్యులైజేషన్ కాకపోవడంతో తిరిగి ఉద్యమబాట పట్టి దాన్ని సాధించారు. అనంతరం ఉద్యోగం కొనసాగిస్తూనే బీఎడ్, ఎంఏ, పీజీ డిప్లమో ఇన్‌కన్నడ పూర్తి చేశారు. 1970లో గ్రేడ్‌వన్‌తెలుగు పండిట్‌గా జోహరాపురం, అనంతరం డిపెప్‌లో కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారిగా, జిల్లా బాలకల విద్యాభివృద్ధి అధికారిగా పనిచేసి 2002లో పదవీ విరమణ చేశారు.

భరతమాత ఆలయ నిర్మాణం...

విశ్వ హిందూ పరిషత్‌భావజాలంతో ప్రభావితమైన జేఎస్ఆర్‌కే శర్మ కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల విభాగ్ ప్రముఖ్‌గా పనిచేశారు. అదే సమయంలో కర్నూలు, నంద్యాల జిల్లా కేంద్రాల్లో భరతమాత ఆలయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అలా నగరంలోని నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలో భరతమాత ఆలయం నిర్మించారు. నంద్యాల్లో ఆలయ నిర్మాణానికి స్థలాన్ని సేకరించి ఇచ్చారు. అలాగే నగరంలో కొండారెడ్డి బురుజు సమీపంలో తెలుగుతల్లి విగ్రహ స్థాపన, కిసాన్ ఘాట్ సమీపంలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహ స్థాపనకు ఎంతో శ్రమించారు.

సాహితీ రంగంలో ఇలా...

పత్తికొండలో తెలుగు ఉపాధ్యాయులను, భాషాభిమానులను ప్రోగు చేసి 'లలిత కళాసమితి' పేరుతో అనేక కార్యక్రమాలు నిర్వహించారు. అనేక మంది కవులను ఆహ్వానించి సాహితీగోష్టులు, చర్చాగోష్టులు, పుస్తక ఆవిష్కరణ చేపట్టారు. ఆలూరు తాలూకాలో పనిచేస్తున్నప్పుడు డాక్టర్ సి.నారాయణరెడ్డి, గండ్లూరి దత్తాత్రేయ శర్మ, గడియారం రామకృష్ణశర్మ, కలుగోట్ల విజయ దత్తాత్రేయ వంటి పండితులతో కార్యక్రమాలు చేపట్టారు. ఎమ్మిగనూరులో జాతీయ సాహిత్య పరిషత్తు మహాసభలను దిగ్విజయంగా నిర్వహించారు. అలాగే ప్రాచీన సాహిత్య పరిషత్‌సంస్థను స్థాపించి వందలాదిగా కార్యక్రమాలు చేపట్టారు. 1996లో స్త్రీ స్ఫూర్తి అనే పత్రిక స్థాపించి, 2017 వరకు కొనసాగించారు. 1998లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన తెలుగు కళాసమితికి కార్యదర్శిగా సేవలు అందించారు. 2000 సంవత్సరంలో డిపెప్‌లో పనిచేస్తున్నప్పుడు అక్షర అనే పత్రిక సంపాదకుడిగా జిల్లా ప్రాథమిక విద్యా పథకం కార్యక్రమాలను ముద్రించారు. 2000 సంవత్సరంలో తెలుగు భాషా వికాస ఉద్యమం సంస్థను చేపట్టి, రాష్ట్ర వ్యాప్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహించారు.



జేఎస్ఆర్‌కే శర్మ రాసిన పుస్తకాల్లో కొన్ని...

రచనలు ఎన్నో... పురస్కారాలు మరెన్నో...

జేఎస్ఆర్‌కే శర్మ తన సుదీర్ఘ సాహిత్య ప్రస్థానంలో 300పైగా పుస్తకాలకు వ్యాసాలు, పీఠికలు, ముందుమాటలతోపాటూ అనేక పుస్తకాలు స్వయంగా రాసి వెలువరించారు. తెలుగు భాష వికాస ఉద్యమం - గమ్యం-గమనం పుస్తకం విశేష ఆదరణ పొందింది. అలాగే వందే భారత మాతరం, దేశంకోసం, సహృదయ గీతికలు, కర్నూలు జిల్లా సాహితీ విశేషాలు, జిల్లా కవితరంగిణి, శ్రీకృష్ణదేవరాయలు, పింగళి సూరన సాహితీవైభవం వంటి గ్రంథాలను ముద్రించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి 1983లో, రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డులను దక్కించుకున్నారు.



'భువన విజయ ప్రబంధ సంక్షిప్త సంకలనం

'రోబోట్' నైపుణ్యంతో మెరుగైన భవిష్యత్తు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త నాని

పాణ్యం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రోబోట్‌లపై నైపుణ్యం పెంపొందించుకుంటే మెరుగైన భవిష్యత్తు ఉంటుందని బెంగళూరు డీఆర్‌డీవో శాస్త్రవేత్త నాని మేడిచర్ల అన్నారు. శనివారం ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఏఐఎంఎల్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సాంకేతిక సదస్సు అమోఘ 2కె25ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ఏఐఎంఎల్ విభాగానికి సంబంధించి ఆర్ఓఎస్ ల్యాబ్‌లో ఉత్తమ సాంకేతికత ఉన్న రోబోట్‌లపై నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. సదస్సులో రోబోట్‌ను ప్రదర్శించారు. హైదరాబాద్ డెల్ టెక్నాలజీస్ శాస్త్రవేత్త నరేష్‌బిల్లా, ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్, హెచ్‌వోడీ కిశోర్‌కుమార్, కోఆర్డినేటర్ హరగోపాల్, హైదరాబాద్ రోబో మిరాకిల్ నిర్వాహకుడు రియాజ్ షేక్ అహ్మద్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సహనమే శాంతికి మార్గం

- విస్మరిస్తే.. వినాశనానికి దారి
- నేడు అంతర్జాతీయ శాంతి దినోత్సవం



ఆత్మకూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మానవ సహనమే ప్రపంచ శాంతికి మార్గంగా నిలుస్తుందని మేధావులు చెబుతుంటారు. మనిషి తన మనుస్సును ఆధీనంలో ఉంచుకోలేని క్రమంలో అసహనానికి గురైతే హింసా మార్గం వైపు నడవాల్సి వస్తోంది. క్షణికావేశంలోనే తీసుకునే కఠిన నిర్ణయాలు పెను విపత్తులకు దారితీస్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రపంచంలో శాంతియుత వాతావరణం కోల్పోయి ప్రజలు అశాంతికి గురికావాల్సి వస్తోంది. శాంతియుత విధానాల వల్ల కలిగే సత్ఫలితాలను ప్రపంచానికి చాటి చెప్పాలన్న తలంపుతో ప్రపంచస్థాయిలో కాల్పుల విరమణ, అహింస, శాంతి, సోదరభావాల సాధన కోసం ప్రతిఏటా సెప్టెంబరు 21న అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచంలోనే ఎటువంటి అల్లర్లు, ఘర్షణలు తావులేకుండా శాంతియుత జీవనానికి ప్రజానీకం మొగ్గుచూపాలన్న ఆకాంక్షతో శాంతి కపోతాలు ఎగరవేసి శాంతిపట్ల ప్రజల్లో అవగాహన కల్పించేలా ప్రతిఏటా ఓ నినాదంతో ఈ దినోత్సవాన్ని దేశాలన్ని.. ఆనవాయితీగా జరుపుతున్నారు.

1981లో సెప్టెంబరు 21న ఐక్యరాజ్య సమితి సాధారణ సమావేశం ప్రారంభమైన సందర్భంగా కోస్టారికా సమర్పించిన తీర్మానం ప్రకారం ప్రకారం ప్రతి ఏటా సెప్టెంబరు 21వ తేదీన ప్రపంచ శాంతి దినంగా జరుపుకోవాలని ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశం ప్రకటించింది. సర్వత్రా శాంతియుత భావాలను బలోపేతం చేయడానికి గానూ ప్రపంచ శాంతి దినాన్ని అంకితం చేయాలని ఆయా దేశాల ప్రతినిధులు నిర్ణయించారు. తొలి ప్రపంచ శాంతి దినాన్ని 1982 సెప్టెంబరులో నిర్వహించగా, 2002లో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సెప్టెంబరు 21వ తేదీన అంతర్జాతీయ శాంతి దినోత్సవ నిర్వహణకు శాశ్వత తేదీగా నిర్వహించారు. 60దేశాల ప్రజలు విరాళంగా ఇచ్చిన నాణేలతో ఒక పెద్ద శాంతి గంటను తయారు చేసి యునైటెడ్ నేషన్స్ అసోసియేషన్ ఆఫ్ జపాన్ ఐరాసకు బహుకరించారు. న్యూయార్క్‌లోని ఐరాస కేంద్ర కార్యాలయం ఆవరణలోని వెస్ట్‌కోర్ట్ తోటలో ఈ గంటను ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం శాంతి దినోత్సవానికి సంబంధించిన కార్యక్రమాలు ఈ గంట మ్రోగించిన తర్వాత దీని సమీపంలోనే నిర్వహిస్తారు.

రాగచైత్ర అసాధారణ ప్రతిభ

- ఏకంగా ఏడు బహుమతులు కైవసం



బహుమతులతో రాగచైత్ర

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పోటీలంటే ఆ బాలికకు అమితానందం. ఒకటి కాదు..రెండుకాదు ఏకంగా ఏడు బహుమతులు కైవసం చేసుకుని అందరినీ అబ్బురపరచింది. జిల్లా చరిత్రలో ఇంతటి ఘనత ఎవరికీ దక్కలేదని నిరూపించింది. నంద్యాల పట్టణంలోని గుడ్‌షెప్పర్డ్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రాగచైత్ర ఈ ఘనత సాధించింది. ఇటీవల నంద్యాలలో రాష్ట్ర సాంస్కృతిక సంస్థ, కళారాధన ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో రాగచైత్ర నాలుగు ప్రథమ, రెండు ద్వితీయ, ఒకటి నాలుగో స్థానం బహుమతులు కైవసం చేసుకుంది. గత 25ఏళ్ల కళార్చన పోటీల్లో ఏడు బహుమతులు సాధించిన ఘనత రాగచైత్రదే. రాగచైత్ర పోటీల్లో చలనచిత్ర విశ్లేషణ, తెలుగు హ్యాండ్ రైటింగ్, ఇంగ్లీష్ హ్యాండ్ రైటింగ్, చిత్ర విశ్లేషణలో మొదటి బహుమతి, లెటర్ రైటింగ్, స్పాట్ డ్రాయింగ్ పోటీల్లో ద్వితీయ బహుమతి, డ్రాయింగ్ పోటీలో 4వ బహుమతి సాధించింది. రాగచైత్ర అసాధారణ ప్రతిభను ప్రముఖులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

అంతరించిపోతున్న పగటి వేషాలు..!

- వారి వేషం గంభీరం.. బతుకు భారం..
- పూట గడవని స్థితిలో పగటి వేషగాళ్లు
- తరాలుగా ఇదే వృత్తిని నమ్ముకున్న కళాకారులు



కోసిగిలో పగటి వేషం వేస్తున్న కళాకారులు

కోసిగి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దసరా వచ్చిందంటే సంబరాలే కాదు. ముఖాలకు రంగులు వేసుకుని వివిధ రకాల వస్త్రధారణతో వచ్చే పగటివేషగాళ్లు కూడా. పగటి వేషాల గురించి ప్రస్తుత సిటీ జనరేషన్‌కు పెద్దగా తెలియకపోవచ్చు. వారి వేషాలు ప్రజా వినోదం ప్రధాన ఆశయం. ప్రజల ఆశలకూ, ఆశయాలకు దర్పణంగా పేరొందాయి. ప్రత్యేకంగా పగటిపూట వివిధ రకాల వేషాలతో వచ్చి అలరిస్తుంటారు... అందుకే వారిని పగటి వేషగాళ్లు అంటారు. పగటి వేషాల్లో ఉండే గొప్పతనం ఇతరులను నమ్మించడం, ఒకనాటి పరిపాలకుల దృష్టికి ప్రజల సమస్య సమస్యలను తీసుకురావడం, వర్తమానాలను చేరవేయడం. కానీ ప్రస్తుతం తరం వాళ్లు పగటి వేషగాళ్లు అంటే ప్రస్తుత తరం వాళ్లు యాచకులుగా చూస్తున్నారు. నిజానికి పగటి వేషాల లక్ష్యం వ్యంగం. వీరికి రంగస్థలం అంటూ లేదు. ఇంటిగడప, వీధులు, సందులు అన్నీ వీరికి రంగస్థల వేదికలే. ప్రదర్శన సమయాల్లో ప్రేక్షకులు, ప్రదర్శకుల మధ్య ఎలాంటి వ్యత్యాసం చూపరు. పురాణ గాథలను, ఆ గాథల్లోని వారిని తమ వేషాలతో ప్రదర్శిస్తుంటారు. హార్మోనియం, తబలా వంటి వాద్యాలతో పాటు యక్షగాన శైలిలో వీరి ప్రదర్శన ఉంటుంది. కానీ పగటి వేషగాళ్లు అక్కడక్కడ అరుదుగా కనిపిస్తూ అంతరించిపోతున్న కళను కాపాడుతున్నారు. ప్రస్తుత సమాజానికి కొన్ని కళారూపాలు దూరం అవుతున్నాయి. వాటిలో ప్రధానంగా ఉన్నది పగటి వేషాలే. వీరిని ఆదరించేవారు, అభిమానించేవారు కరువవుతున్నారు. వీరికి ఆదరణ లేకపోతే పగటివేషాలు ఇకపై పగటి కలలుగా మారే అవకాశం ఉంది. కోసిగిలో అంతరించి పోతున్న కళకు జీవం పోస్తూ కొందరు కళాకారులు ప్రదర్శనలు ఇస్తున్నారు. తాతల కాలం నాటి పగటి వేషాలను తండ్రులు, కొడుకులు కూడా వేస్తూ పూట గడపడం కోసం వేస్తున్నామనీ పగటి వేషగాళ్ల కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని కళాకారులు తులసీరామ్, రంగస్వామి, హార్మోన్ శంకరప్ప, రాము అమరేష్, మారెప్పలు ఆవేదన వ్యక్తం చేశారు.



హార్మోనియం వాయిస్తున్న కళాకారుడు శంకరప్ప కౌతాళం మండలం, ఉరుకుంద

- ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలి

తాతాల కాలం నుంచి మా తండ్రులు, మేము పగటివేషగాళ్లతోనే జీవనం పొందుతున్నాము. ప్రభుత్వం పగటి వేషగాళ్ల గుర్తించి మాకు న్యాయం చేయాలి.. బేడ బుడగ జంగం అయిన మేము ఆర్థికంగా చాలా వెనుకబడ్డాం. జీవనోపాధి కోసం పగటి వేషాలు వేస్తున్నాం.

- తులసీరామ్, కళాకారుడు

తాతల కాలం నుంచి ఇదే జీవనోపాధి



తాతల కాలం నుంచి మా తండ్రులు, మేము పగటి వేషాలే తప్ప మరో ఉపాధి లేదు. మేము మా వేషాలు గంభీరంగా ఉన్నా బ్రతుకు మాత్రం దుర్భరంగా భారంగా ఉంది. ప్రతి నెలా పింఛన్లు ఇచ్చి ప్రభుత్వం మా కళాకారులను గుర్తించాలి.

- రంగస్వామి, కళాకారుడు

సమాజాన్ని మేల్కొలుపుతూ...

పగటి వేషగాళ్లు ప్రధానంగా జానపద కళారూపకమైన పగటి వేషాన్ని ప్రదర్శిస్తారు. పగటి వేష కళాకారులు ఒకే ప్రదర్శనలో అనేక రకాల పాత్రలను, స్త్రీ పురుష వేషాలను ధరించి వినోదంతో పాటు సామాజిక, సాంస్కృతిక అంశాలను ప్రజలకు అర్థమయ్యేలా చెప్పడం వీరి లక్ష్యం. సమాజంలోని అట్టడుగు వర్గాల నుంచి వచ్చి సంస్కృతిని పరిరక్షిస్తున్నారు. ఇతర కళారూపాలకు భిన్నంగా వీరు ఎలాంటి సుదీర్ఘ ప్రారంభాలు లేకుండా నేరుగా వేషంలోకి ప్రవేశించి ప్రజలకు అనుగుణంగా ప్రదర్శనలు కొనసాగిస్తారు. తెలుగు రాష్ట్రాల్లో పగటి వేషం అంటారు. కర్ణాటకలో పగలు వేసిన ఆట.. తమిళనాడులో పగలు వేశం.. వంటి రాష్ట్రాల్లో కూడా పగటి వేషాలతో రాణిస్తున్నారు. ప్రాచీన కాలంలో అనేక పగటి వేషాలు ప్రదర్శించబడేవి. కానీ అన్ని వేషాలు ఇప్పుడే వేయడం లేదు. కారణం జీవనంలో వచ్చిన మార్పులే అని చెబుతున్నారు.



కళ

భీముడు వేష ధారణలో కళాకారుడు తులసీరామ్, కౌతాళం మండలం, ఉరుకుంద

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

కోవెలకుంట్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ కౌలు రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం కోవెలకుంట్లలో చోటు చేసుకుంది. ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి వివరాల మేరకు.. కోవెలకుంట్ల పట్టణంలోని ఎల్ఎం కాంపౌండుకు చెందిన కోగిల చంద్రశేఖర్ (50) అనే వ్యక్తి సుమారు 15 ఎకరాలు కౌలుకు తీసుకుని వివిధ పంటలను సాగు చేశాడు. పెట్టుబడి కోసం సుమారు రూ.16లక్షలు అప్పు చేశాడు. పంట సరిగా పండకపోవడంతో నష్టం వాటిల్లింది. దీనికి తోడు ట్రాక్టర్ లోను తీసుకున్నాడు. అప్పులు తీర్చలేననే మనస్తాపంతో చంద్రశేఖర్ శుక్రవారం రాత్రి పట్టణంలోని జీసీఆర్ పెట్రోలు బంకు సమీపంలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని కుమారుడు రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి..

బండిఆత్మకూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రాలేదని ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఈర్నపాడు గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ జగన్మోహన్ కథనం మేరకు... గ్రామానికి చెందిన కేశవ్ (28) అనే వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నారని, తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

యర్రగుంట్ల గ్రామంలో..

శిరివెళ్ల, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంట్ల గ్రామానికి చెందిన గని తిమ్మరాజు(42) అనే వ్యక్తి శనివారం చెట్టుకు ఉరేసుకుని మృతి చెందాడు. శిరివెళ్ల ఎస్ఐ చిన్న పీరయ్య తెలిపిన వివరాల మేరకు.. హమాలీ పని చేసుకుని జీవనం సాగిస్తున్న తిమ్మరాజు మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోకుండా ఉండేవాడన్నారు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది గ్రామంలోని ఓ పాఠశాల పక్కన ఉన్న ముళ్లపొదల్లో చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

విద్యుదాఘాతంతో బాలుడు..

ఆత్మకూరు రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టపల్లి గ్రామానికి చెందిన యుగంధర్ నాయక్ (12) శనివారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని ముష్టపల్లికి చెందిన శివకృష్ణ నాయక్ కుమారుడు యుగంధర్‌నాయక్ శనివారం తమ ఇంటి పరిసరాల్లోని జామ చెట్టుపై జామ కాయలు తెంచేందుకు చెట్టు ఎక్కాడు. ఆ చెట్టుపై ఉన్న విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురై ఒక్కసారిగా చెట్టుపై నుండి కింద పడి పోయాడు. హుటాహుటిన ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు బాలున్ని తరలించారు. కాగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. చేతికి అంది వచ్చిన కుమారుడు మృత్యువాత పడటంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగి పోయింది. సీఐ రాము ప్రభుత్వ ఆసుపత్రి చేరుకుని వివరాలను తెలుసుకున్నారు.

రెండు బైకులు ఢీ.. ముగ్గురికి గాయాలు

కొత్తపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాపరం మలుపు వద్ద ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. శనివారం కొత్తపల్లి మండలంలోని బట్వారుపల్లి నుంచి తిమ్మరాజు, రాముడు ద్విచక్రవాహనంపై ఆత్మకూరు వస్తున్నారు. అలాగే బండి ఆత్మకూరు మండలం నారాయణపురం గ్రామానికి చెందిన నందయ్య, మల్లయ్య మండలంలోని గోకవరం గ్రామానికి ద్విచక్రవాహనంపై వస్తున్నారు. మార్గమధ్యలోనే లింగాపురం-కొత్తపల్లి గ్రామాల మలుపు వద్ద ప్రమాదవశాత్తు రెండు బైకులు ఢీకొన్నాయి. దీంతో తిమ్మరాజు, నందయ్య, మల్లన్నలకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేసినట్లు తెలుస్తోంది.

కర్ణాటక ఆర్టీసీ బస్సు, వాహనం ఢీ

మంత్రాలయం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం సమీపంలో అభయాంజనేయ స్వామి దేవాలయం వద్ద కర్ణాటక ఆర్టీసీ బస్సును బొలేరో లగేజ్ వాహనం ఢీకొట్టింది. దీంతో డ్రైవర్ సాహేర బాషాకు గాయాలయ్యాయి. ఈరోడ్డు ప్రమాదం శనివారం రాత్రి జరిగింది. మంత్రాలయం హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జునస్వామి తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక మైసూర్ డిపోకు చెందిన బస్సు రోడ్డు పక్కన పార్కింగ్ చేశారు. నందవరంకు చెందిన బొలేరో వాహనం రాయచూరులో పత్తిలోడు దించి మంత్రాలయానికి వస్తుండగా బస్సును ఢీకొట్టింది. దీంతో బస్సుకున్న డీజల్ ట్యాం కు పగిలిపోయింది. బొలేరో డ్రైవర్ సాహేర బాషాకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న మంత్రాలయం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు.

వీడిన విద్యార్థిని కిడ్నాప్ మిస్టరీ

చాగలమర్రి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): చాగలమర్రిలో విద్యార్థిని కిడ్నాప్ మిస్టరీ వీడింది. చాగలమర్రి గ్రామంలోని పెద్దమకానం సమీపంలోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతున్న విద్యార్థినిని గుర్తు తెలియని వ్యక్తులు గురువారం కారులో తీసుకెళ్లి కిడ్నాప్ చేసిన సంఘటన తెలిసిందే. విద్యార్థిని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆరా తీశారు. విద్యార్థిని సెల్‌ఫోన్ లోకేషన్ ఆధారంగా కడపలో ఉన్నట్లు గుర్తించారు. వారిని ఆళ్లగడ్డ రూరల్ పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి సీఐ, ఎస్ఐ విచారించారు. అనంతరం చాగలమర్రి తహసీల్దార్ వద్ద బైండోవర్ చేయించారు. అనంతరం విద్యార్థినిని ఆమె తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్టు

- రూ.5 లక్షల విలువజేసే 4 వాహనాలు స్వాధీనం



ద్విచక్రవాహనాల దొంగ అరెస్టును చూపుతున్న పోలీసులు

గోనెగండ్ల, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాల దొంగలపై గోనెగండ్ల పోలీసులు డేగ కన్నువేశారు. గత జూన్ 18న రూ. 30లక్షలు విలువ చేసే 35 వాహనాలను స్వాధీనం చేసుకొని ఒకరిని అరెస్టు చేయగా శనివారం మరో ద్విచక్రవాహన దొంగను అరెస్టు చేశారు. దొంగ దగ్గర నుంచి రూ. 5లక్షల విలువ చేసే 4 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గోనెగండ్ల సీఐ విజయభాస్కర్ వివరాల మేరకు.. బెళగల్ మండలం పోలుకల్లు గ్రామానికి చెందిన ఉప్పరి వీరేశ్ కొంత కాలంగా బస్టాండ్, దేవాలయాలు, ఇండ్లముందు, హోటళ్ల ముందు నిలిపిన ద్విచక్ర వాహనాలను దొంగలించే వాడు. గత కొంత కాలంగా ద్విచక్రవాహనాలు దొంగ తనం జరుగుతుండటం, అలాగే 6-5-25న గొల్ల మధుశేఖర్, 26-9-2024న చంద్రశేఖర్ తమ ద్విచక్రవాహనాలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారని గోనెగండ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు డీఎస్పీ భార్గవి ఆధ్వర్యంలో గోనెగండ్ల సీఐ విజయభాస్కర్ తన బృందంతో విచారణ చేపట్టాడు. వాహనాల దొంగ బెళగల్ మండలం పోలుకల్లు గ్రామానికి చెందిన ఉప్పరి వీరేశ్‌గా గుర్తించారు. దీంతో కొన్ని రోజులుగా పోలీసులు డేగకన్నువేసి అనుసరించారు. శనివారం పథకం ప్రకారం మాటు వేసి గాజులదిన్నె క్రాస్ రోడ్డు వద్ద రూ. 5లక్షల విలువ చేసే 4 ద్విచక్రవాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. ద్విచక్రవాహనాల దొంగను పట్టుకుని వాహనాలను రికవరీ చేయడమే గాకుండా దొంగను పట్టుకోవడంలో చాకచక్యం చూపిన సీఐ విజయభాస్కర్, సిబ్బంది దేవరాజు, ఎన్‌టీ కుమార్, కార్తీక్, మద్దిలేటి, కృష్ణానాయక్, మహేంద్ర, డీఎస్పీ భార్గవి అభినందించారు.

జ్ఞాపకాలు.. చెల్లాచెదురు..!

- ఒకప్పుడు 65 ఏళ్లకు.. ఇప్పుడు 35 ఏళ్లకే
- కర్నూలు జీజీహెచ్‌కు పెరుగుతున్న బాధితులు
- నేడు వరల్డ్ అల్జీమర్స్ డే



కర్నూలు పెద్దాసుపత్రిలోని న్యూరాలజీ ఐసీయూ



కర్నూలు హస్పిటల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అల్జీమర్స్ జ్ఞాపక శక్తిని నాశనం చేసే వ్యాధి. ఇది ఏ వయస్సు వారికైనా వస్తుంది. ఒకప్పుడు 65 ఏళ్లకు వచ్చే ఈ వ్యాధి ప్రస్తుతం 35 ఏళ్లలో కనిపిస్తుంది. వయస్సుతో పాటు ఎంతో కొంత మతిమరుపు రావడం సహజం. దానికి చింతించాల్సిన అవసరం లేదు. కాసిన్ని కొండ గుర్తులు పెట్టుకోవడం ద్వారా ఆ గండం దాటవచ్చు. వయసు పెరిగేకొద్ది వచ్చే అల్జీమర్స్ వ్యాధి సోకిన వారు తమ పేరు మర్చిపోతారు. ఒకేచోట కూర్చుని పనిచేసేవారు, టీవీలు చూస్తు ఉండటం, అతిగా మద్యం సేవించడం, శారీరక, మానసిక వ్యాయామం లేకపోవడం, అధిక కొవ్వు ఉన్న మాంసం తినడం వల్ల కూడా ఈ వ్యాధి సోకే అవకాశం ఉంది. ఈ వ్యాధి సోకిన వారు బంధువులు, కుటుంబ సభ్యుల పేర్లు మార్చిపోతారు. పేర్లు మర్చిపోవడంతో పాటు వారిని గుర్తించడం కూడా కష్టమే. వారు చేసే వృత్తి, వ్యాపారం కూడా గుర్తుండవు.. చివరకు తిన్నామా లేదా స్నానం చేశామా లేదా అనేవి కూడా ప్రశ్నలుగా మారుతాయి. మెదడులో ఉన్న కొన్ని కణాల పనితీరు తగ్గడమే అల్జీమర్స్‌కు దారి తీస్తుంది. అదే విదంగా తలకు బలమైన గాయాలు తగిలినప్పుడు, ఇన్‌ఫెక్షన్లు, బ్రెయిన్‌లో కణతులు ఏర్పడటం, బీ12 విటమిన్ లోపాలు, థైరాయిడ్, మెదడు పోటు బాధితులకు త్వరగా అల్జీమర్స్ వచ్చే అవకాశం ఉంటుంది. మలివయసులో జీవితాన్ని దుర్భరంగా మారే ఈ మహమతి మరుపు రాకుండానే మేల్కోవాలి. 1901లో ఈ వ్యాధిని గుర్తించారు. మన దేశంలో ప్రతి 27 మందిలో ఒకరు అల్జీమర్స్ బాధితులే. ఈ వ్యాధి గుర్తించి అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం సెప్టెంబరు 21న ప్రపంచ అల్జీమర్స్ డేగా జరుపుకుంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇది పరిస్థితి..

అల్జీమర్స్ బాధితుల సంఖ్య క్రమంగా పెరుగుతుంది. ఎక్కువగా 65 ఏళ్ల నుంచి 75 ఏళ్లలో ఇది కనిపించేవి. ప్రస్తుతం 40 ఏళ్ల పైబడిన వారిలో ఇలాంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. ప్రధానంగా అమలాయిడ్ ప్రికర్సర్ ప్రోటీన్ అనే జన్యుపరమైన ప్రోటీన్ డిఫెక్ట్ కారణంగా అల్జీమర్స్ సోకుతుంది. కర్నూలు జీజీహెచ్‌లోని న్యూరాలజీ విభాగంలో 20 పడకలు, స్ట్రోక్ యూనిట్ (ఐసీయు)కు 12 పడకలు ఉన్నాయి. ప్రతి సోమ, గురు వారాల్లో ఓపీ ఉంటుంది. ప్రతి ఓపీకి 150 నుంచి 160 మంది రోగులు వస్తుంటారు. ఇందులో ప్రతి నెల న్యూరాలజీ విభాగానికి దాదాపు 100 అల్జీమర్స్ కేసులు వస్తుంటాయి. పది శాతం కేసులు మతిమరుపు లక్షణాలతో వస్తూంటాయి.

ఈ జాగ్రత్తలు అవసరం

- ప్రతి రోజూ వ్యాయామం చేయాలి.
- శ్వాసను నెమ్మదిగా పీల్చుకుంటే ఏకాగ్రత పెరుగుతుంది.
- నిద్ర అనేది చాలా ముఖ్యమైంది. ప్రతిరోజూ 8గంటలు నిద్రపోవాలి.
- ప్రతి పనికి కంగారు పడకుండా ఉండాలి.
- ప్రతిరోజూ ఇష్టమైన పుస్తకాలు చదవాలి.
- విటమిన్ బీ12 లోపం లేకుండా చూసుకోవాలి. నాన్‌వెజ్, ఆకుకూరలు, కూరగాయలు తినాలి.
- ప్రతి పనికి కంగారు పడకుండా ఉండాలి
- మధుమేహాన్ని, బీపీని అదుపులో ఉంచుకోవాలి
- చెస్, స్క్రాబిన్ వంటి ఆటలు ఆడాలి.
- సంగీతం వినడం, పాటలు పాడటం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవచ్చు.

డిమోన్షియా క్లీనిక్‌లు అవసరం



అల్జీమర్స్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో డిమోన్షియా క్లీనిక్‌లు ఎంతో ఉపయోగపడుతాయి. త్వరలో వీటిని న్యూరాలజీ విభాగంలో ఏర్పాటు చేస్తున్నాం. 65 ఏళ్లలో 5శాతం అల్జీమర్స్ లక్షణాలు ఉండగా.. 70 ఏళ్లలో 10 శాతం, 85 ఏళ్లలో 40 శాతంకు పెరుగుతుంది. వ్యాయామం లేకపోవడం, అందరితో కలిసి మాట్లాడకపోవడం ప్రతి పనికి ఒత్తిడికి గురి కావడం, చిన్న చిన్న విషయాలను మరిచిపోవడం లక్షణాలు ఉంటే ప్రారంభదశలో గుర్తించి చికిత్స తీసుకోవాలి. **- డాక్టర్ సి.శ్రీనివాసులు, న్యూరాలజీ హెచ్‌వోడీ, కర్నూలు జీజీహెచ్**

40 ఏళ్లు దాటిన వారిలో...



ఇటీవల కాలంలో అల్జీమర్స్ వ్యాధి 40 ఏళ్లు దాటిన వారిలో కనబడుతుంది. మారిన జీవనశైలి, నిద్రలేమి ఒత్తిడి, మధుమేహం, ఊబకాయం, బీపీ జన్యు సమస్యల వల్ల అల్జీమర్స్ వచ్చే అవకాశం ఉంది. మంచి నిద్ర, ఒత్తిడి నియంత్రణలో పెట్టుకోవాలి. సమతుల్య ఆహారం తీసుకోవడం, నీరు ఎక్కువగా త్రాగడం, ఆల్కహాల్, స్మోకింగ్‌లకు దూరంగా ఉండాలి. **- డాక్టర్ నాగ సురేష్, కన్సల్టెంట్ న్యూరో ఫిజీషియన్, మెడికవర్ హాస్పిటల్**

నిద్రతో జ్ఞాపకశక్తి పెరుగుతుంది



8 గంటలు తప్పనిసరిగా నిద్రపోవాలి. మంచి నిద్రతోనే జ్ఞాపకశక్తి పెరుగుతుంది. విటమిన్ బీ-12 లోపం వల్ల కూడా అల్జీమర్స్ వచ్చే ప్రమాదం ఉంది. ఆహారంలో యాంటి ఆక్సిడెంట్లు, ఓమేగా త్రిప్యాటీ యాసిడ్‌లు తీసుకోవాలి. అల్జీమర్స్‌ను త్వరగా గుర్తించాలి. అల్జీమర్స్‌ను త్వరగా గుర్తించాలి. ఏదైనా విషయం గుర్తుండాలంటే 8 సెకన్లు ఆలోచించాలి. దానీ మీద ఏకాగ్రత పెట్టాలి. **- డాక్టర్ చల్లపల్లె బాబురావు, కన్సల్టెంట్, న్యూరో ఫిజీషియన్, కిమ్స్ హాస్పిటల్**

ఉల్లి రైతులను ఆదుకునేందుకు సీఎం కృషి

- మంత్రి టీజీ భరత్



కర్నూలు అర్బన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కష్టాల్లో ఉన్న ఉల్లి రైతులను ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు అన్ని విధాలా కృషి చేస్తున్నారని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం నగరంలోని తన కార్యాలయంలో ఒక ప్రకటన ద్వారా హర్షం వ్యక్తం చేశారు. ఉల్లి పండించిన ప్రతి రైతుకూ హెక్టారుకు రూ.50 వేలు సహాయం అందించేందుకు సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకోవడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. హెక్టారుకు రూ. 50 వేలు ఆర్థిక సాయం చేయాలన్న నిర్ణయంతో ప్రభుత్వంపై వంద కోట్ల పైగా భారం పడినప్పటికీ సీఎం చంద్రబాబు ముందుకు వచ్చారని కొనియాడారు. ఈ సహాయం ద్వారా 24,218 మంది రైతులకు లబ్ధి చేకూరుతుంద న్నారు. అయినా ఓర్వలేని వైసీపీ నాయకులు ప్రభుత్వంపై బురదచల్లుతున్నారని ధ్వజమెత్తారు. వైసీపీ పాలనలో ఉల్లి ధరలు పతనమైనప్పటికీ పట్టించుకోలేదన్నారు. అదే కూటమి ప్రభుత్వం ఉల్లి ధరలు పడిపోతే ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచిందన్నారు. ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయంలో భాగంగా మొదటి విడతగా రూ.7 వేలు జమచేశామన్నారు. ఉల్లి రైతులకు అండగా నిలబడేందుకు కిలో రూ.12 చొప్పున ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందన్నారు.

ఉల్లి రైతుల కన్నీళ్లు తుడిచిన చంద్రబాబు : సోమిశెట్టి

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉల్లి రైతుల కన్నీళ్లు తుడిచిన మహనీయుడని కుడా చైర్మన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుందన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో ఉల్లి ధరలు ఒక్కసారిగా కిలో రూ. 2 నుంచి 4కు పడిపోయి రైతులు రోడ్డెక్కిన సందర్భాలు అనేకం ఉన్నాయన్నారు. క్వింటా ఉల్లి రూ. 517కు పడిపోయిందన్నారు. ఎన్నికల సమయంలో రూ. 3 వేలకోట్లతో ధరల స్థిరీకరణ చేస్తామన్న జగన్ మాటతప్పి, మడమ తిప్పారని గుర్తు చేశారు. అదే కూటమి ప్రభుత్వం ఉల్లి రైతుకు అండగా నిలుస్తుంటే ఫేక్ ఆత్మహత్యలకు ప్రేరేపిస్తూన్నారని ధ్వజమెత్తారు.

ఉల్లి రైతుకు సాయంపై ఎంపీ బస్తిపాటి హర్షం

ఉల్లిరైతులకు నగదు సహాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించడంపై ఎంపీ బస్తిపాటి నాగరాజు శనివారం నగరంలోని తన కార్యాలయంలో ఒక ప్రకటన ద్వారా హర్షం వ్యక్తం చేశారు. ధరలు లేక నష్టపోతున్న ఉల్లి రైతులకు నగదు సాయం గొప్ప ఊరట ఇచ్చే అంశమన్నారు. ఉల్లి రైతులను ఆదుకుంటున్న సీఎం చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలిపారు. ఉల్లి రైతులకు అండగా ఉండేందుకు కిలో రూ. 12కి ప్రభుత్వమే కొనుగోలు చేస్తుండటంతో పాటు రూ. 10 కోట్లకు పైగా ప్రభుత్వంపై భారం పడుతున్నప్పటికి ప్రతి రైతుకూ హెక్టారుకు రూ.50 వేలు సాయం అందించడం సాహసోపేతమైన నిర్ణయమని కొనియాడారు.

జగన్‌రెడ్డి పాలనలో నిర్లక్ష్యం : తిక్కారెడ్డి

వైసీపీ పాలనలో రైతుల పట్ల నిర్లక్ష్యం వహించారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. శనివారం ఆ పార్టీ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. ఉల్లి రైతులకు సాయం అందించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించడంపై ధన్యావాదాలు తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 405278 ఎకరాలపైగా సాగు చేశారని, 24,218 కుటుంబాలకు ప్రత్యక్ష్యంగా ఉపయోగపడుతోంది. గత వైసీపీ పాలనతో ఎంత మంది ఆత్మహత్యలు చేసుకున్నా ఆదుకున్న పాపాన పోలేదన్నారు. రైతులకు వెన్నుపోటు పొడిచి నేడు ప్రేమ ఉన్నట్లు మొసలి కన్నీరు కార్చడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పత్తికొండలో జ్యూస్ ఫ్యాక్టరీ త్వరలో ప్రారభించి యుద్ధప్రాతిపదికన పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టామని ఆయన తెలిపారు.

ఉల్లి రైతులకు అండగా ప్రభుత్వం - పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి



కల్లూరు: ఉల్లిపంట పండించిన ప్రతిరైతుకు హెక్టారుకు రూ.50వేలు ఆర్థికసాయం అందించి కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. తీవ్రభావంతో పాటు ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతిని మద్దతుధర లబించకపోయినా సీఎం చంద్రబాబు క్వింటాకు రూ.1200 మద్దతుధర కల్పించి కొనుగోలు చేస్తున్నారన్నారు. ఖరీఫ్ సీజన్‌లో 45,278 ఎకరాల్లో ఉల్లిపంట సాగు చేశారని ఆర్థికసాయం ద్వారా 24,218 మంది రైతులకు లబ్ధి చేకూరుతోందన్నారు.

ఉల్లి రైతులకు అండగా సీఎం



మాట్లాడుతున్న కోడుమూరు ఎమ్మెల్యే

కర్నూలు రూరల్: సీఎం చంద్రబాబు ఉల్లి రైతులకు అండగా నిలిచారని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పేర్కొన్నారు. శనివారం కర్నూలు మండలం పసుపుల గ్రామంలోనిమ స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఉల్లి సాగుచేసిన ప్రతి రైతుకు హెక్టారుకు రూ.50వేలు చొప్పున ఆర్థిక సాయం చేసేందుకు సీఎం నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రూ.వంద కోట్ల భారం పడినా ప్రభుత్వం వెనకడుగు వేయలేదున్నారు. గత వైసీపీ ప్రభుత్వం రైతులు పట్టించుకోలేదని ఇప్పుడు కూటమిపై ఆ పార్టీ నాయకులు ఉల్లిరైతులను రెచ్చగొట్టి రోడ్డెక్కిస్తున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు. మండల టీడీపీ కన్వీనర్ బుర్రా వెంకటేశ్ నాయుడు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు రామాంజనేయులు, పద్మ పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం

- వైసీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి విమర్శించారు. శనివారం ఎస్వీ కాంప్లెక్స్‌లోని కార్యాల యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి రైతులపై కుట్రలు చేస్తున్నారన్నారు. హెక్టార్‌కు రూ.50వేలు ఇస్తున్నామని, విపత్తు ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని రైతులను మోసం చేస్తున్నారన్నారు. ఉల్లిపంటను కొనకుండా ప్రభుత్వం ఎకరానికి రూ.20 వేలు ఇస్తామని చెబుతోందన్నారు. ఎకరానికి 1.50 లక్షల ఖర్చు వస్తే హెక్టార్‌కు రూ.50 వేలు ఇస్తే నష్టమే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.50 వేలు, రూ.1200 గిట్టుబాటు ధర ఏ మాత్రం సరిపోదన్నారు. కూటమి ప్రభుత్వం తక్షణమే ఉల్లికి గిట్టుబాటు ధర కల్పించి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే మెడికల్ కళాశాల పేరుతో ప్రభుత్వం దోపిడీకి పాల్పడుతోందన్నారు.

మట్కారాయుళ్ల అరెస్టు

- రూ.38,430 నగదు.. మూడు సెల్ ఫోన్లు స్వాధీనం

మంత్రాలయం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలం రచ్చుమర్రికి చెందిన ముగ్గురు మట్కా రాస్తుండగా శనివారం అరెస్టు చేసి వారి నుంచి రూ.38.430 నగదు, 3 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు మాధవరం ఎస్ఐ విజయకుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న ప్రభుత్వ విప్



చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఈవో

శ్రీశైలం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహా పుణ్యక్షేత్రాన్ని శనివారం ఏపీ ప్రభుత్వ విప్ పి.జి.వి.ఆర్ నాయుడు (గంగబాబు) శనివారం దర్శించుకున్నారు. అధికారులు, అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈవో ఎం.శ్రీనివాసరావు శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదం, స్వామి, అమ్మవార్ల చిత్రపటాలను అందించారు.

స్వచ్ఛ జిల్లాగా తీర్చిదిద్దాలి

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

● రిలే దీక్షలో జేఏసీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీకాంతరెడ్డి



రిలేనిరాహార దీక్షలో పాల్గొన్న విద్యుత్ ఉద్యోగులు

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాడుతామని జేఏసీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీకాంతరెడ్డి, వినుకొండ కృపవరం స్పష్టం చేశారు. శనివారం నంద్యాల ఎస్ఈ కార్యాలయం దగ్గర విద్యుత్ జేఏసీ నాయకులు రిలేనిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. సోమవారం కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్లి మెమోరాండమ్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ రామయ్య, రవికుమార్, శ్రీరాములు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాహితీ దిగ్గజం సుబ్రహ్మణ్యశాస్త్రి

● విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రనాథ్

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): సాహితీ దిగ్గజం సుబ్రహ్మణ్యశాస్త్రి అని నంది్రైతు సమాఖ్య సలహాదారు విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రనాథ్ కొనియాడారు. శనివారం పట్టణంలోని భారతీ సీడ్స్ కార్యాలయంలో సూరనసారస్వత సంఘం అధ్యక్షుడు డాక్టర్ గెలివి సహదేవుడు అధ్యక్షతన పట్టణానికి చెందిన శతాధిక పుస్తక రచయిత, ప్రముఖ కవి గొట్టుముక్కల సుబ్రహ్మణ్యశాస్త్రి 85వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సాహిత్య సంఘాల ప్రతినిధులు, కవులు సుబ్రహ్మణ్యశాస్త్రి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. శాస్త్రి సోదరుడి కుమారుడైన రాఘవేంద్రశర్మను సత్కరించారు. కార్యక్రమంలో రచయితలు కొప్పుల ప్రసాద్, రఫీ, శ్రీనివాసమూర్తి, డాక్టర్ కిశోర్‌కుమార్, శ్రీనివాసరెడ్డి, సముద్రాల మనోహర్, మురళీకృష్ణ, కృష్ణారెడ్డి, జయరాంరెడ్డి, కైలాసనాథరెడ్డి, కవులు, రచయతలు, సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

తబస్సుమ్‌కు ఎన్ఆర్ఐ సాయం

● 'సరస్వతీ పుత్రికకు శోకం' శీర్షికకు స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చదువుల తల్లి తబస్సుమ్‌కు ఎన్ఆర్ఐ అండగా నిలిచారు. 'ఆంధ్రజ్యోతి'లో 'సరస్వతీ పుత్రికకు శోకం' అనే శీర్షికను ఏప్రిల్ 30న కథనం ప్రచురితమైంది. ఆన్‌లైన్‌లో వీక్షించిన అమెరికాలో నివాసముంటున్న రామాయణం శ్రీను వెంటనే నంద్యాలకు చెందిన తన స్నేహితుల ఎస్ఎండీ అబు లైస్ ద్వారా సమాచారం తెలుసుకున్నారు. చదువును ఏ మాత్రం ఆపవద్దని, ఆ కుటుంబానికి తనవంతు సాయం అందిస్తానని ముం దుకువచ్చారు. టీటీసీ పూర్తిచేసేందుకు రూ.25వేలు పంపించారు. తబస్సుమ్‌కు ఆ చెక్కును శనివారం నంద్యాల ఉర్దూ కళాశాల ప్రిన్సిపాల్ కరీముల్లా, ఆల్‌మేవా నాయకులు ఎస్ఎండీ అబులైజ్, ఇమ్రాన్‌ఉసేన్ అందజేశారు.

వీఆర్ఏలకు కనీసం వేతనం ఇవ్వాలి

ఆత్మకూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): వీఆర్ఏలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌బాబు, వీఆర్ఏల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు మహేష్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట వీఆర్ఏలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీవో నాగజ్యోతికి వినతిపత్రాన్ని అందజేశారు. సంఘం నాయకులు పరమేశ్వరుడు, మధు, నాగరాజు, దేవన్న తదితరులున్నారు.

అంతర్గత రహదారులను నిర్మించాలి

ఆత్మకూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆయా కాలనీల్లో అంతర్గత రహదారులతో పాటు డ్రైనేజీలను నిర్మిం చాలని సీపీఎం నాయకులు రణధీర్, నాగేశ్వరరావు డిమాండ్ చేశా రు. శనివారం పట్టణంలోని ఏకలవ్యానగర్ కాలనీలో సీపీఎం నాయకులు పర్యటించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏకలవ్యానగర్‌లో సరైన డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రహదారులు లేకపోవడం వల్ల చిన్నపాటి వర్షాలకే ఇళ్లలోకి వర్షపునీరు చేరుతోంద న్నారు. స్థానిక సమస్యలపై అనేకమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు రామ్‌నాయక్, సురేంద్ర, రమణ తదితరులున్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన ఉండాలి

పాణ్యం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని ఇంజనీరింగ్ విద్యార్థులు సూచించారు. శనివారం ఆర్జీఎం ఈసీఈ విభాగానికి చెందిన ఐఈఈఈ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో బలపనూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు స్టీం (శాస్త్ర, సాంకేతిక, ఇంజనీరింగ్, గణితం)పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌వోడీ సోఫియాప్రియదర్శిని, ఐఈఈఈ ఎస్‌పీఎస్ చైర్మన్ క్రాంతికుమార్, వైస్ చైర్మన్ అరీఫ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అరటి సాగులో మెలకువలు పాటించాలి

మహానంది, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతులు అరటి సాగులో మెలకువలు పాటించాలని మహానంది ఉద్యావన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త టి. హేమాద్రి సూచించారు. శనివారం గాజులపల్లిలో అరటికి తెగుళ్లు సోకినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం అరటికి సిగతోక తెగులు సోకినట్లు తెలిపారు. సస్యరక్షణ చర్యలు చేపట్టి దిగుబడులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో నంద్యాల ఉద్యానవన శాఖాధికారి బి. హరేంద్ర, ఉద్యాన సహాయకురాలు పి. విశ్వధా, టీడీపీ నాయకులు రవినాథరావు, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిర్మూలిద్దాం: జేసీ

గోస్పాడు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధిస్తూ స్వచ్ఛమైన పరిసరాలను ఏర్పాటు చేసుకుందామని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా శనివారం గోస్పాడులో సచివాలయం ఆవరణలో కొబ్బరిమొక్కలను నాటారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని అన్నారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీవో షేక్ అమానుల్లా, తహసీల్దార్ షేక్ మొహిద్దీన్, ఎంపీపీ ఆర్థర్‌సైమన్, ఈవోఆర్డీ నాగ అనసూయ, ఏపీవో గంగన్న, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

కురుకుంద గ్రామంలో ర్యాలీ

ఆత్మకూరు రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి ముప్పు అని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తులసి దేవి అన్నారు. శనివారం స్వచ్ఛంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కురుకుంద గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ ఉమ్మర్, వరదరాజస్వామి ప్రాజెక్ట్ చైర్మన్ పోచా మల్లికార్జున రెడ్డి, సర్పంచ్ మహబూబ్‌బీ, ఏఈ పక్కీరయ్య, పంచాయతీ కార్యదర్శి జీవన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గడివేముల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుర్వేసి గ్రామ సమీపంలోని ఓ రైతు మామిడితోటలో పేకాట ఆడుతున్న ఎనిమిదిమందిని పాణ్యం సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, గడివేముల ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి దాడి చేసి పట్టుకున్నారు. మూడు ద్విచక్రవాహనాలను, రూ.6,510 నగదును, మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

● మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్
● కలెక్టర్‌తో కలిసి మొక్కలు నాటిన మంత్రి

నంద్యాల టౌన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ నంద్యాల జిల్లాగా తీర్చిదిద్దాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. శనివారం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పీవీ నగర్ డంపింగ్ యార్డులో కలెక్టర్ రాజకుమారితో కలిసి మంత్రి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రజలందరు భాగస్వాములు కావాలన్నారు. పరిసరాలను శుభ్రంగా చేసుకోవాలని సూచించారు. జిల్లాలో పచ్చదనం తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని కోరారు. అలా కవర్లు వాడే దుకాణాలపై మున్సిపల్ అధికారులు జరిమానా విధించాలని ఆదేశించారు. మురుగు నీరు రోడ్లపైకి కాల్వల్లో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని సూచించారు. స్వచ్ఛ లక్ష్యసాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, చైర్‌పర్సన్ మాబున్నీసా, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, నాయకులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛతతోనే అభివృద్ధి సాధ్యం

ఆత్మకూరు: స్వచ్ఛతతోనే అభివృద్ధి సాధ్యమని ఆత్మకూరు మార్కెట్ యార్డు చైర్మన్ వంగాల కృష్ణారెడ్డి అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సింగిల్ విండో చైర్మన్ షాబుద్దిన్, టీడీపీ మం డల, పట్టణాధ్యక్షులు రవీంద్రబాబు, వేణుగోపాల్‌తో కలిసి ఆత్మకూరులోని ఉన్నత పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ నజీర్‌అహ్మద్, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా, నాయకులు రామ్మూర్తి, నాగూర్ ఖాన్, జనసేన పార్టీ నాయకులు శ్రీరాములు, అరుణ్ తదితరులున్నారు. అలాగే స్థానిక తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణలో బీజేపీ నాయకులు మోమిన్ షబానా ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ రత్నరాధిక, డిప్యూటీ తహసీల్దార్ రవణమ్మ, సిబ్బంది తదితరులున్నారు.

నందికొట్కూరు రూరల్ : గ్రామాలు పచ్చదనం పరిశుభ్రతతో కళకళలాడాలని బ్రాహ్మణకొట్కూరు సింగిల్‌విండో సొసైటీ చైర్మన్ మద్దూరు హరిసర్వోత్తమరెడ్డి అన్నారు. శనివారం బ్రాహ్మణకొట్కూరు గ్రామంలో మండల ప్రత్యేక అధికారి సైదా సబేహాపర్వీన్, ఎంపీడీవో రంగనాయక్ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో చెత్తను తొలగించి మొక్కలను నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ మరియమ్మ, కార్యదర్శి శాంతయ్య, ఏఓ అమరేంద్రుడు, మాజీ సర్పంచ్ ఖలీలుల్లాబేగ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



మొక్క నాటిన మంత్రి, కలెక్టర్ తదితరులు



బ్రాహ్మణకొట్కూరులో పరిసరాలను శుభ్రం చేస్తున్న అధికారులు

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



మొక్కకు నీరు పోస్తున్న కలెక్టర్

నంద్యాల ఎడ్యుకేషన్: మొక్కలను విరివిగా నాటి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ రాజకుమారి అన్నారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం లో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జేసీ విష్ణుచరణ్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబరులో ఏపీ గ్రీన్ థీమ్‌లో భాగంగా ప్రతి ఇంటి వద్ద కనీసం ఒక్క మొక్కను నాటాలని కోరారు. భవిష్యత్ తరాలకు శుభ్రమైన వాతావరణం కల్పించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా జూట్ లేదా కాటన్ బ్యాగులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో రామునాయక్, ఏవో సుభకర్ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

● నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య
● దోమల నివారణ లక్ష్యంగా గంబూషియా చేపల విడుదల
● ఉల్లి రైతులను పంట బీమా ద్వారా హెక్టారుకు రూ.50 వేలు ఆర్థిక సాయం

నందికొట్కూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. శనివారం పట్టణంలోని ఎన్టీఆర్ జలాశయంలో, బొల్లవరం, నాగలూటి గ్రామాల్లోని చెరువులు, నీటి కుంటల్లో గంబుషియా చేపలను జిల్లా మలేరియాశాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్‌తో కలిసి ఎమ్మెల్యే విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నుంచి ప్రజలను కాపాడేందుకు కూటమి ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉంటామన్నారు.

● ఉల్లి రైతులకు అండగా నిలిచిన కూటమి ప్రభుత్వం

ధరాగాతం వల్ల తీవ్రంగా నష్టాల పాలవుతున్న ఉల్లి రైతులకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 45.278 ఎకరాల్లో ఉల్లిపంట సాగు చేశారన్నారు. హెక్టారుకు రూ.50 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారన్నారు. దీంతో కూటమి ప్రభుత్వంపై రూ.100 కోట్లు పైగా భారం పడుతున్నా... రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వెనుకడుగు వేయడం లేదన్నారు. ఇప్పటికే రైతులకు ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడిన ఆయం ఇస్తున్నామన్నారు. అందులో భాగంగా ఇప్పటికే మొదటి విడతలో రూ.7 వేలు అందజేసినట్లు ఆయన తెలిపారు. వర్షాభావం, ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులకు భరోసా కల్పిస్తున్నది కూటమి ప్రభుత్వమేనన్నారు. కార్యక్రమంలో నందికొట్కూరు మార్కెట్ యార్డు చైర్మన్ వీరం ప్రసాద్‌రెడ్డి, కౌన్సిలర్లు భాస్కర్‌రెడ్డి, జాకీర్, చిన్నరాజు, టీడీపీ నాయకులు షకీల్ అహ్మద్, వేణుగోపాల్, గిరి, మల్లికార్జునరెడ్డి, మున్సిపల్ కమిషనర్ బేబి పాల్గొన్నారు.



పట్టణంలోని ఎన్టీఆర్ జలాశయంలో గంబూషియా చేపలను వదులుతున్న ఎమ్మెల్యే జయసూర్య

ఆత్మకూరు పట్టణంలోని నీటికుంటల్లో..

ఆత్మకూరు: దోమల నియంత్రణలో భాగంగా పట్టణంలో నీటికుంటల్లో గంబూసియా చేపలను మలేరియా నియంత్రణ విభాగం సిబ్బంది విడుదల చేశారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ ఆఫీసర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని కొత్తపేటలో గల కోనేరుతో పాటు పలు ఏరియాల్లో నీటినిల్వలు ఉండే ప్రదేశాల్లో గంబూసియా చేపలను విడుదల చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బైర్లూటి పీహెచ్‌సీ వైద్యులు పవన్‌కుమార్, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు జుబేర్, సూపర్‌వైజర్లు మస్తానయ్య, సిబ్బంది భాస్కర్, రాజగోపాల్, విశ్వనాథ్ తదితరులు ఉన్నారు.



బండి జయరాజును పరామర్శిస్తున్న మాండ్ర, ఎమ్మెల్యే

బాధిత కుటుంబానికి పరామర్శ

నందికొట్కూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పగిడ్యాల మండలం నెహ్రూనగర్ గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకుడు బండి జయరాజు మాతృమూర్తి భాగ్యమ్మ ఇటీవల మృతి చెందారు. శనివారం బండి భాగ్యమ్మ చిత్రపటానికి నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, మార్కెట్ యార్డు చైర్మన్ వీరం ప్రసాద్‌రెడ్డి నివాళి అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్ర మంలో నెహ్రూనగర్ టీడీపీ నాయకులు రామస్వామి, వెంకటస్వామి, బక్కన్న తదితరులు పాల్గొన్నారు.

చెంచులు ఆరోగ్యంపై నిర్లక్ష్యంగా ఉండొద్దు

కొత్తపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చెంచులు తమ ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయరాదని వైద్యాధికారి జబ్బీర్ అన్నారు. శనివారం మండలంలోని ఎర్రమఠం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జానాల గూడెం, బలపాలతిప్ప, సిద్దేశ్వరం కపిలేశ్వరం గ్రామాల్లో సంచార చికిత్స లో భాగంగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. చెంచులకు, ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యశిబిరంలో ఎంఎల్‌హెచ్‌పీ రాజేష్, ఏఎన్ ఎంలు శాంతమ్మ, నిర్మల, జయమణి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గ్రీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగస్వాములు కావాలి

● మున్సిపల్ కమిషనర్ బేబి

నందికొట్కూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ బేబి అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాల, గాంధీ మెమోరియల్ హైస్కూల్, శ్లోకా స్కూల్‌లలో కమిషనర్ బేబి మొక్కలు నాటారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్టు శ్రీను, శ్లోకా స్కూల్ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రతి చిన్నారికి అపార్ కార్డు తప్పనిసరి

నంద్యాల నూనెపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీల్లో విద్యనభ్యసించే ప్రతి చిన్నారికి అపార్ కార్డు తప్పని సరిగా ఉండాలని సీడీపీవో చంద్రకళ తెలిపారు. శనివారం పట్టణంలో ని పలు అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణమాసం కార్యక్రమంలో భాగం గా చిన్నారులకు అపార్ ఐడి నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

సీఎస్ఐ సమాధుల తోట స్థలం సర్వే

నందికొట్కూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కొన్ని రోజు లుగా సీఎస్ఐ సమాధుల తోట స్థలం సర్వే వాయిదా పడుతూ వస్తోంది. శనివారం రెవెన్యూ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఇరు పార్టీల వారి సమక్షంలో సర్వే నిర్వహించామని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఎవరి స్థలాలను వారికి సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేశామన్నారు. ఇరువర్గాలతో వచ్చే మంగళవారం సమావేశం నిర్వహిస్తామన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

జూపాడుబంగ్లా, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని సహకార సొసైటీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. స్వచ్ఛంద్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం అధికారులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. తంగడంచలో సొసైటీ చైర్మన్ కొబ్బరి మొక్క నాటారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, డీటీలు సత్యదీప్, నాగన్న, ఏపీడీ దాసు, ఏపీవో రేష్మా తదితరులు పాల్గొన్నారు.

మహానంది: పచ్చదనం పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండగలమని ఎంపీడీవో మహ్మద్‌దౌలా అన్నారు. శనివారం స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛదివస్ కార్యక్రమంలో భాగంగా మహానందిలోని విలేజ్ క్లినిక్ పరిసరాల్లో వివిధ రకాల మెక్కలు నాటారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, ఈవోఆర్డీ నాగేంద్రుడు, పంచాయతీ కార్యదర్శి కలువ భాస్కర్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పాములపాడు : ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలలో పర్యావరణాన్ని కాపాడుకుందామని మండల ప్రత్యేక అధికారి రాజు అన్నారు. శనివారం మండలంలోని కోల్స్ ఆనందాపురం గ్రామంలో స్వచ్ఛంద్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఏపీవో జయంతి, ఏపీఎం ఉమామహేశ్వరి , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపల్లి: ఇంటి ఆవరణంలో ఒక మొక్క నాటాలని తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీవో మేరీ సూచించారు. శనివారం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రీన్ ఏపీని పురస్కరించుకుని మండ లంలోని ఆయా ప్రభుత్వ కార్యాలయ ఆవరణంలో మొక్కలు నాటారు. ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మిడుతూరు: ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేక అధికారి జాకీర్ హుశేన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో దశరథరామయ్య, తహసీల్దారు శ్రీనివాసులు, టీడీపీ మండల కన్వీనర్ కాత రమేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి బ్రిడ్జి నిర్మాణంపై మంత్రి బీసీ ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాణి-మహారాణి థియేటర్ సమీపంలో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులపై రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆరా తీశారు. 'ఆంధ్రజ్యోతి'లో ఏళ్లవుతోంది.. పట్టించుకోండి అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దాంతో శనివారం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి స్పందించి ఎస్సార్బీసీ ఎస్ఈ శివకుమార్‌ను బ్రిడ్జి పనుల విషయమై ఫోన్ ద్వారా సమాచారాన్ని తెలుసుకున్నారు. కాంట్రాక్టర్‌కు, భూమి యజమానులకు చెల్లించాల్సిన బకాయిలు ఏ మేరకు ఉన్నాయి.. బ్రిడ్జి పనులు పూర్తి చేయడానికి ఎన్ని నిధులు అవసరమో అనే అంశాలపై ఆరా తీశారు. కలెక్టర్‌తో ప్రతిపాదనలు పంపాలని కోరినట్లు సమాచారం. అలాగే కలెక్టర్ రాజకుమారి స్పందించి ఎస్ఈ శివకుమార్‌తో చర్చించారు. పాత బ్రిడ్జి మరమ్మతులకు, నూతన బ్రిడ్జి బకాయిల విషయం ప్రతిపాదనలు పంపాలని సూచించారు. త్వరలోనే పాత బ్రిడ్జి మరమ్మతులు, కొత్త బ్రిడ్జి నిర్మాణానికి నిధులు విడుదల కానున్నట్లు సమాచారం.

మంత్రిని కలిసిన తహసీల్దారు

నంద్యాల రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల రూరల్ తహసీల్దార్‌గా శ్రీవాణి నియమితులైయ్యారు. శనివారం ఆమె న్యాయ, మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు. నంద్యాల ఎస్సార్బీసీలో డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వహించి బదిలీపై నంద్యాలకు వచ్చినట్లు తెలిపారు. సోమవారం బాధ్యతలు చేపట్టనున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

పాణ్యం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలకు మోడల్ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ దినేష్‌బాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈనెల 19న నంద్యాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో విద్యార్థులు బి, రాహుల్ , లక్ష్మీయువరాజ్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 25న పశ్చిమగోదావరి జిల్లాలో జరిగే స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ బాక్సింగ్ చాంపియన్ షిప్ అండర్- 14, 17 కిలోల విభాగంలో పాల్గొంటారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, పీడీ కిరణ్‌కుమార్, కోచ్ గణేశ్ అభినందించారు.

సంతను శివారులో ఏర్పాటు చేయాలి

నంద్యాల రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జీవాల సంతను పట్టణ శివారులో ఏర్పాటు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ కోరారు. నంద్యాల రాణి మహారాణి థియేటర్ సమీపంలో శనివారం ఆయన మాట్లాడుతూ జీవాల సంతను కుందూనది వద్ద నిర్వహించడంతో అటువైపు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందన్నారు. దీంతో నందమూరి నగర్, వైఎస్సార్ నగర్, రాయమాల్పురం, పులిమద్ది తదితర గ్రామాలకు వెళ్లే ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. జీవాల సంతను ట్రాఫిక్‌కు అంతరాయం కలగని చోట ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

పలు ఆలయాల హుండీ లెక్కింపు

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ఆలయాల హుండీని శనివారం దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి, ఈవో లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో లెక్కించారు. కాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానం హుండీని లెక్కించగా రూ.7,85,763లు, బ్రహ్మానందీశ్వరస్వామి ఆలయ హుండీ ద్వారా రూ.47,264లు వచ్చినట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో భక్తులు, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

మిడుతూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్యాధికారులు అన్నారు. శనివారం కడుమూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు రాజు, వ్యోమ కేశవ, అనిల్ ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించాలి. బాలింతలకు పౌష్టికాహారం అందించారు. కార్యక్రమంలో సర్పంచు జీవరత్నం, సీహెచ్‌వో సురేష్ బాబు, పీహెచ్ఎన్ గురుదేవి, సూపర్‌వైజర్లు ఏసేపు, రామతులశమ్మ, నాయకులు గోవర్ధన్ రెడ్డి, వీరారెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో హైవే డ్రైనేజీల సమస్య పరిష్కారం

పాణ్యం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పాణ్యం పరిధిలోని హైవే డ్రైనేజీ సమస్యను 45 రోజుల్లో పరిష్కరిస్తామని రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌వే ప్రైవేట్ లిమిటెడ్ ప్రాజెక్ట్ హెడ్ మదన్‌మోహన్ అన్నారు. శనివారం హైవే పక్కన పెట్రోల్ బంకు సమీపంలో పంటల రస్తాకు అడ్డుగా నిర్మిస్తున్న వాటిని ఆయన పరిశీలించారు. పంట రస్తాకు అడ్డుగా ఉన్న హైవే నిర్మాణాలను 15 రోజుల్లో తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో ఇండిపెండెంట్ ఇంజనీర్లు టీం లీడర్ సుధాకర్‌రావు, కార్తీక్, వీఆర్వో శంకర్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

రైతు మహాసభలను జయప్రదం చేయాలి

బండిఆత్మకూరు సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా రెండవ రైతు మహా సభలను జయప్రదం చేయాలని రైతు సంఘ జిల్లా నాయకుడు రాజశేఖర్, డేవిడ్ కోరారు. శనివారం బండిఆత్మకూరులో రైతు సంఘం ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. అక్టోబరు 11, 12 తేదీల్లో ఆత్మకూరులో మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రత్నమయ్య, రాజు, రామచంద్రుడు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

రేపటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

బండిఆత్మకూరు సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీప్రాంతంలో వెలసిన ఓంకార క్షేత్రంలో సోమవారం నుంచి వచ్చే నెల 2వరకు దసర శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో ఆకృతి నాగప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 22న రాజరాజేశ్వరీ, 23న బాల త్రిపుర సుందరి, 24నగాయత్రి, 25న అన్నపూర్ణదేవి, 26న మహాలక్ష్మీ, 27న లలితాదేవి, 28న వనదేవత, 29నసరస్వతీదేవి, 30న దుర్గాదేవి, వచ్చేనెల 1న మహిసాసురమర్ధిని, 2న ఉమామహేశ్వరీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనం ఇస్తారన్నారు. కాశిరెడ్డినాయన ఆశ్రమంలో నిత్యాన్నదానం ఉంటుందని ఈవో తెలిపారు.

జీజీహెచ్‌కు ఫ్యాన్లు వితరణ

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఎంసీహెచ్ బ్లాక్‌కు నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో మధుమణి నర్సింగ్‌హోం, మధుమణి చారిటబుల్ సొసైటీ తరఫున ఆరు ఫ్యాన్లను శనివారం అందజేశారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మల్లేశ్వరి మాట్లాడుతూ ఐఎంఏకు ధన్యవాదాలు తెలిపారు. డాక్టర్ రవికృష్ణ, డాక్టర్ మధుసూదన్‌రావు మాట్లాడుతూ భవిష్యత్‌లో జీజీహెచ్‌కు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంసీహెచ్ వైద్యులు అరుణజ్యోతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలి

గడివేముల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల డీఏ బకాయిలను తక్షణమే చెల్లించాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిలర్ గోపాల్‌రావు కోరారు. శనివారం మండల కేంద్రంలో ఏపీటీఎఫ్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా ఉపాధ్యాయులు, ఉద్యోగుల పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే 11వ పీఆర్సీ బకాయిలు, సరెండర్ లీవ్ బకాయిలను తక్షణమే చెల్లించాలని అన్నారు. డీఎస్సీలో ఎంపికైన టీచర్లకు నియామక పత్రాలను ఉమ్మడి జిల్లా కేంద్రంలోనే ఇవ్వాలని అన్నారు. సమావేశంలో గడివేముల ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బాలస్వామి, రాంపుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచడం మన బాధ్యత

ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

డోన్ టౌన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత అని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద గ్రీన్ ఏపీ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోట్ల పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో నరసింహులు, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు, సీఐ ఇంతియాజ్ బాషా, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్రికే ఫణిరాజ్, ఓబులాపురం శేషిరెడ్డి, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, కోట్రికే హరికిషన్, రేగటి అర్జున్ రెడ్డి, టీఈ రాఘవేంద్రగౌడు, చంద్రపల్లి లక్ష్మీనారాయణ, టీడీపీ మండల అధ్యక్షులు వెంకటనాయునిపల్లె శ్రీనివాసులు యాదవ్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● అలాగే పట్టణంలోని బాలికల పాఠశాల ఆవరణంలో చెట్టు నాటే కార్యక్రమానికి ఎమ్మెల్యే కోట్ల హాజరై మొక్కలు నాటారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కొన్ని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. వీటిపై ఎమ్మెల్యే స్పందిస్తూ కేవలం 10 రోజుల్లో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

● అలాగే పట్టణంలోని లక్ష్మీఫంక్షన్ హాలులో జరిగిన రాయ లసీమ దైవ సేవకుల సదస్సు కార్యక్రమంలో ఎమ్మెల్యే కోట్ల హాజరై. సామాజిక సేవకులు, మత పెద్దలతో ఎమ్మెల్యే స్నేహపూర్వకంగా మాట్లాడి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. దైవ సేవకులు పాల్గొన్నారు.

మళ్లీ ఉప్పొంగిన పాలేరు, గోండ్ర వాగు



ఉధృతంగా ప్రవహిస్తున్న గోండ్రవాగు

సంజామల, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మళ్లీ పాలేరు, గోండ్రవాగు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లాయి. మండల వ్యాప్తంగా, పైతట్టు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షానికి మండలంలోని పాలేరు, గోండ్ర వాగు, కప్పలవాగు శనివారం ఉదయం నుంచి ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వాగుల ఉధృతికి ప్రయాణికుల వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సంజామల నుండి గుళ్లదుర్తి మీదుగా జమ్మలముడుగు వెళ్లే ప్రయాణికులకు సంజామల సమీపంలోని కప్పలవాగు, కోవెలకుంట్ల నుంచి సంజామల మీదుగా తాడిపత్రికి వెళ్లే ప్రయాణికులకు పాలేరువాగు, గోండ్రవాగు తీవ్ర ఆటంకం కలిగించాయి. వాగులో ఉధృతిని దృష్టిలో ఉంచుకొని కోవెలకుంట్ల ఆర్టీసీ డిపో మేనేజర్ బస్సును నిలిపివేశారు. ఎస్ఐ రమణయ్య సిబ్బందితో వాగు వద్ద పహార ఏర్పాటు చేశారు.

ఉగ్రరూపం దాల్చిన కుందూ

చాగలమర్రి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజోలి ఆనకట్ట వద్ద గల కుందూ శనివారం వరద నీటితో ఉగ్రరూపం దాల్చింది. ఎగువ నుంచి వచ్చిన వరద నీరు ఆనకట్ట వద్ద పొంగి ప్రవహించింది. 26 వేల క్యూసెక్కులతో కుందూ ప్రవహించినట్లు కేసీకెనాల్ ఏఈ జమాల్‌వలి తెలిపారు. ఆనకట్టవద్దగల 5 గేట్లను ఎత్తి కడప జిల్లావైపుకు వరద నీటిని విడుదల చేశామని అన్నారు. ముందస్తుగా కేసీ కాలువకు నీటి మట్టం తగ్గించామన్నారు.

ఎర్రమల కొండల్లో భారీ వర్షం

అవుకు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రమల కొండల్లో భారీ వర్షం శనివారం సాయంత్రం కురిసింది. దీంతో కొండ మీది గ్రామాలైన కొండమనాయునిపల్లె, జూనుంతల, ఉప్పలపాడు గ్రామాలు జలమయయ్యాయి. కొండల్లో కురిసిన వర్షం వాగులు, వంకల ద్వారా అవుకు రిజర్వాయర్‌కు చేరుతుంది.

విద్యార్థులు దేశానికి సేవలందించాలి

బనగానపల్లె, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు దేశానికి సేవలందించాలని కర్నూలు ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ అలోక్ త్రిపాఠి అన్నారు. శనివారం బనగానపల్లె ప్రభుత్వ ఉన్నతపాఠశాలను ఆయన సందర్శించారు. హెచ్ఎం గ్రూప్ కమేండర్‌కు జ్ఞాపికను అందించారు. ఏపీ మెడికల్ కమాండింగ్ అధికారి మేజర్ వైవీ సీకెరెడ్డి, లెఫ్టినెంట్ కల్నర్ శశికుమార్, బనగానపల్లె ఉన్నతపాఠశాల ఎన్‌సీసీ అధికారి వెంక టేశ్వర్లు పాల్గొన్నారు.

మండల ప్రత్యేకాధికారిగా లీలావతి

రుద్రవరం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం మండలం ప్రత్యేక అధికారిగా లీలావతిని జిల్లా కలెక్టరు రాజకుమారి నియమించారు. ఇక్కడ మండల ప్రత్యేక అధికారిగా పనిచేస్తున్న నాగరాజును బదిలీ చేశారు. శనివారం ఆమె సచివాలయాలను తనిఖీ చేసి, మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



ఇల్లూరు కొత్తపేటలో అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కోరారు. శనివారం బనగానపల్లె ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం మంత్రి బీసీ అధ్యక్షతన జరిగింది. మంత్రి బీసీ మాట్లాడుతూ కార్పొరేట్ వైద్యశాలకు దీటుగా బనగానపల్లె ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని తీర్చిదిద్దుతామన్నారు. సమావేశంలో బనగానపల్లె ప్రభుత్వ ఆస్పత్రిలోని ప్రధాన సమస్యలు, భవిష్యత్తు కార్యాచరణపై ప్రభుత్వ వైద్యులతో, కమిటీ సభ్యులతో మంత్రి చర్చించారు. ఆస్పత్రిలో కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, వైద్య పరికరాలు, సిబ్బంది కొరత వంటి సమస్యలపై, అంశాలపై అధికారులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో గైనకాలజిస్టు, స్టాఫ్‌నర్సుల కొరత ఉందని మంత్రి దృష్టికి సూపరింటెండెంట్ డాక్టర్ శైలజ, సూర్యకుమారిలు తీసుకెళ్లారు. మంత్రి ఆస్పత్రిని పరిశీలించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. సొంత నిధులతో ఆస్పత్రిలో ఆర్వోప్లాంట్ ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈసమావేశంలో ఆర్డీవో నరసింహులు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు టంగుటూరు శ్రీనయ్య, నియాజ్ హుసేన్, ఫక్కూర్‌బీ, అహమ్మద్‌హుసేన్, లలిత, తహసీల్దారు నారాయణరెడ్డి, డాక్టర్ రాఘవేంద్రరెడ్డి పాల్గొన్నారు.

ఏడీ మృతికి మంత్రి సంతాపం: నంద్యాల వ్యవసాయశాఖ ఏడీగా పనిచేస్తున్న బండారు ఆంజనేయ మృతి చెందడంపై మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శనివారం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వ్యవసాయశాఖ అధికారిగా, వ్యవసాయశాఖ జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా సమర్థవంతంగా విధులు నిర్వహించారని మంత్రి ప్రశంసించారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ: మండలంలోని ఇల్లూరు కొత్తపేటలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని మంత్రి బీసీ శనివారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పాఠశాలలో చాలామంది చిన్నారులు గైర్హాజరవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్వాడీ పాఠశాలల్లో చిన్నారులు వంద శాతం హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూపర్‌వైజర్లు, అంగన్ వాడీ కార్యకర్తలను ఆదేశించారు.

డ్రైనేజీ నిర్మాణ పనుల తనిఖీ: మండలంలోని ఇల్లూరు కొత్తపేట గ్రామంలో జరుగుతున్న అండర్ డ్రైనేజీ పనులు మంత్రి తనిఖీ చేశారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతను పాటించాలని కోరారు. స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను ఆదివారం సాయంత్రం మంత్రి క్యాంపు కార్యాలయంలో బీసీ స్వీకరించారు. అప్పటి కప్పుడే కొన్ని సమస్యలను అధికారులకు ఫోన్లు చేసి పరిష్కరించారు. కొన్ని సమస్యలను సంబంధిత శాఖలకు పంపి పరిష్కరించాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. అలాగే అధికారులు, ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని మంత్రిని కోరారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

● మెడికల్ షాపుల్లో తనిఖీలు చేసిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



మెడికల్ షాపులో తనిఖీ చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు

అవుకు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెడికల్ షాపుల నిర్వాహకులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని కర్నూలు రూరల్, నంద్యాల డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు జయరాముడు, హనుమన్న హెచ్చరించారు. శనివారం ఆంధ్రజ్యోతిలో 'నిబంధనలు గాలికి'.. కథనాన్ని ప్రచురితమైంది. స్పందించిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు మెడికల్ షాపులపై దాడులు చేశారు. పట్టణంలోని వెంకటసాయిరాం మెడికల్ షాపుతో పాటు వెంకటేశ్వర మెడికల్, వంశీసాయి మెడికల్, విజయలక్ష్మీ మెడికల్ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న మిగతా షాపుల నిర్వాహకులు షాపులకు తాళాలు వేసి జారుకున్నారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జయరాముడు మాట్లాడుతూ మెడికల్ షాపుల్లో ఫార్మాసిస్టు తప్పని సరిగా ఉండాలన్నారు. షాపుల్లో మందుల క్రయ, విక్రయాల రికార్డులు సరిగా లేవన్నారు. వెంకటసాయిరాం మెడికల్ షాపులో ఫార్మాసిస్టు లేకుండా మందుల విక్రయాలు సాగిస్తుండటంతో షాపును మూసివేశామన్నారు.

ఎస్పీని కలిసిన టీడీపీ నాయకుడు

దొర్నిపాడు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుర్రా రెడ్డిపల్లె గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, లాయర్ కాకర్ల రమేష్ చౌదరి శనివారం ఎస్పీ సునిల్‌షెరన్‌ను కలిసి పుష్పగుచ్చం అందించి లక్ష్మీనరసింహస్వామి చిత్రపటాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎస్పీ శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నారన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

● బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి జగ్గయ్య

● ఘనంగా స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర

చాగలమర్రి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి జగ్గయ్య అన్నారు. శనివారం స్వచ్ఛంధ్ర, స్వర్ణాంధ్రలో భాగంగా మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో సచివాలయం వద్ద మొక్కలు నాటారు. టీడీపీ నాయకులు, అధికారులు కలిసి స్వచ్ఛరహిత సమాజంపై అవగాహన ర్యాలీ చేశారు. చాగలమర్రి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విజయ్‌కుమార్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, కో-ఆర్డినేటర్ రాజ్‌కుమార్, ఏఈలు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: మొక్కలు నాటి పర్యావణాన్ని కాపాడాలని మున్సిపల్ కమిషనర్ కిషోర్ పిలుపునిచ్చారు. శనివారం స్వచ్ఛంద్రా స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో పొదుపు మహిళలతో కలసి మొక్కలు నాటారు. అలాగే స్వచ్ఛంద్రా స్వచ్ఛ దివస్



ఆళ్లగడ్డ మున్సిపల్ కార్యాలయంలో మొక్క నాటుతున్న కమిషనర్

కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి హరిగోపాల్, ఎంపీడీవో నూర్‌జహాన్, ఎంఈవో శోభావివేకవతి పాల్గొన్నారు.

శిరివెళ్ల: ప్రతి ఒక్కరూ మొక్కలు విరివిగా నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కళాశాలలో విద్యార్థులతో కలిసి శనివారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సుధాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: ప్రతి ఒక్కరూ స్వచ్ఛత వైపు నడవాలని తహసీల్దారు ప్రసాద్‌బాబు, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక వైద్యశాలలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వైద్యశాల చుట్టూ మొక్కలు నాటారు. వైద్యాధికారి వినోద్, ఎంపీహెచ్‌ఈవో దస్తగిరి, పీర్‌ఏఈ వెంకటయ్య పాల్గొన్నారు.

దొర్నిపాడు: ప్రజలంతా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని దొర్నిపాడు సహకార సంఘ చైర్మన్ సిద్ధి సత్యనారాయణ అన్నారు. శనివారం స్వచ్ఛంద్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కోవెలకుంట్ల సబ్‌డివిజన్ కో-ఆపరేటివ్ ఆఫీసర్ ఎంపీ ప్రభాకర్‌రావు, సొసైటీ చైర్మన్ సిద్ధి నారాయణ సొసైటీ కార్యాలయంలో మొక్కలు నాటారు.

బేతంచెర్ల: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎంపీడీవో ఫజిల్ రెహిమాన్, కమిషనర్ హరిప్రసాద్ అన్నారు. శనివారం స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్రలో భాగంగా విద్యార్థినులతో మానవహారాన్ని నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్ర మంలో ప్రత్యేక అధికారి మెహరున్నిసా, ఎంపీడీవో ఫజల్ రెహిమాన్, విద్యార్థులు పాల్గొన్నారు.



ముత్యాలపాడులో మొక్క నాటుతున్న అధికారులు, టీడీపీ నాయకులు



కోవెలకుంట్లలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

కోవెలకుంట్ల: అందరి సహకారంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని కోవెలకుంట్ల మండల ప్రత్యేక అధికారి కళ్యాణి అన్నారు. కోవెలకుంట్లలో ఎంపీడీవో వరప్రసాదరావు, డిప్యూటీ ఎంపడీవో ప్రకాశ్ నాయుడు, తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ డీఈవో వెంకట్రామిరెడ్డి, ఎంఈవో వెంకటసుబ్బయ్యలతో కలిసి ఆమె మొక్కలు నాటారు. అనంతరం ప్రతిజ్ఞ నిర్వహించారు.

ప్యాపిలి: మొక్కల సంరక్షణ అందరి బాధ్యతగా భావించాలని సీఐ వెంకటరామిరెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. ఎస్ఐ మధుసూదన్, ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, నవీన్‌పాటి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్‌గా సుధాకర్



ప్రమాణస్వీకారం చేస్తున్న కుమ్మరి సుధాకర్

ప్యాపిలి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్‌గా మండలంలోని గార్లదిన్నె గ్రామానికి చెందిన కుమ్మరి సుధాకర్ శనివారం ప్రమాణస్వీకారం చేశారు. అమరావతిలోని గొల్లపూడి బీసీ సంక్షేమ భవనలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సుధాకర్ తెలిపారు. పదవి రావడానికి సహరించిన సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారాలోకేశ్, డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డిలకు సుధాకర్ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే డోన్ నియోజకవర్గ టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

శిరివెళ్ల, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బాల మద్దిలేటి అన్నారు. మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆఫ్ ఆర్గనైజేషన్‌ను శనివారం ఏర్పాటు చేశామన్నారు. కమిటీ చైర్మన్‌గా గురువర్ధన్‌రెడ్డి, ప్రసిడెంట్‌గా కమతం రఘునాథరెడ్డి, సెక్రటరీగా సూర్య నారాయణరెడ్డిలను ఎన్నుకున్నారు.

ఆలయానికి విరాళం

రుద్రవరం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని వాసాపురం వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి ఆళ్లగడ్డ మండలం కోటకందుకూరు గ్రామానికి చెందిన నల్లగట్ల పార్థసారధిరెడ్డి దంపతులు రూ.లక్షా 116, అలాగే సిరివెళ్ల గ్రామానికి చెందిన ఎం.నాగకుమార్‌రాజు, విజయలక్ష్మి దంపతులు రూ.లక్షా 116లు విరాళంగా శనివారం అందించినట్లు చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, వైస్ చైర్మన్ రంగనాయకులు, కార్యదర్శి కాణాల నరసింహులు తెలిపారు.

రక్తదానం చేయండి: బీజేపీ

రుద్రవరం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): రక్తదానం చేసి ప్రాణదాతలు కండి అని జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు అన్నారు. శనివారం రుద్రవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో అభిరుచి మధు మొక్కలు నాటారు.

మహిళల ఆరోగ్యంతోనే సమాజాభివృద్ధి

డోన్ రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబంతో పాటు సమాజాభివృద్ధి సాధ్యమవతుందని కొత్తబురుజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్‌వైజర్ కే.చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండలంలోని కొత్తబురుజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వాస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మహిళలకు వచ్చే వ్యాధుల పై గైనకాలజిస్టు డా.హరిత అవగాహన కల్పించారు.

రుద్రవరం: మండలంలోని నరసా పురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో స్వస్తినారీ, స్వశక్తిపరివార్ అభియాన్ కింద వైద్యశిబిరం నిర్వహించారు. ఎంపీహెచ్‌వో నాగప్ర సాద్, హెల్త్ సూపర్‌వైజరు ఉన్నారు.

కొలిమిగుండ్ల: మహిళలు ఆరోగ్యంగా ఉంటనే దేశం ప్రగతి సాధిస్తుందని డాక్టర్ హరిచరణ్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక పీహెచ్‌సీ కేంద్రంలో నిర్వ హించిన మహిళల స్క్రీనింగ్ కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు డాక్టర్లు హరిచరణ్‌రెడ్డి, నాగజ్యోతిలు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీచేశారు.

ఉచిత వైద్యశిబిరం

కోవెలకుంట్ల, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ జన్మదిన సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆసుపత్రి వైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ గడ్డం నాగేశ్వర్‌రెడ్డి, డాక్టర్ల విభాగం అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉమామహేశ్వర స్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

బనగానపల్లె, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని యాగంటిలో ఉమామహేశ్వరస్వామి, అమ్మవార్ల కల్యాణం శనివారం ఘనంగా నిర్వహించారు. మాస శివరాత్రి పురస్కరించుకొని ఉమామహేశ్వరస్వామి కళ్యాణాన్ని వేదపండితుల సమక్షంలో నిర్వహించారు. ఈవో పాండురంగారెడ్డి, మౌళీశ్వరరెడి, భక్తులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రుల పుస్తకాల ఆవిష్కరణ

చాగలమర్రి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలపాడు గ్రామంలోగల కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో దసరా ఉత్సవాల సందర్భంగా శనివారం శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పుస్తకాలను ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ముడియం నరసింహరావు, కోశాధికారి ఎం.నరసింహయ్యల ఆధ్వర్యంలో పుస్తకాలను ఆవిష్కరించారు.

ప్రాథమిక పాఠశాలల తనిఖీ

రుద్రవరం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండమాయపల్లె, రుద్రవరం స్పెషల్ ప్రాథమిక పాఠశాలలను శనివారం క్లస్టర్ అబ్జర్వర్ మధు తనిఖీ చేశారు. ఎంఈవో వీరరాఘవయ్య, హెచ్ఎం వెంకటరమణ, సీఆర్పీ రామయ్య పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు చర్యలు

డోన్ టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దోమల నియంత్రణకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. శనివారం జిల్లా సహాయ మలేరియా అదికారి కే.సత్యనారాయణ ఆధ్వర్యంలో గంబూసియా చేపలు (20వేల చేప పిల్లలను) జలదుర్గం, ప్యాపిలి, కొత్తబురుజు, డోన్, చిన్నమల్కాపురం పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల చెరువులో వదిలారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి రాజశేఖర్, వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్పీ అభినందనలు

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని రూపనగుడి గ్రామ చెరువు వద్ద కోవెలకుంట్ల-జమ్మలమడుగు జాతీయ రహదారిలో ఎర్రవాగులో చిక్కుకున్న బస్సు ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకవచ్చిన ఎస్ఐ రామిరెడ్డి, మయాలూరు, గోవిందపల్లె గ్రామస్థులను ఎస్పీ సునీల్ షెరాన్ ఫోన్‌లో అభినందించినట్లు ఎస్ఐ తెలిపారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

డోన్ టౌన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నారాయణ పాఠశాలలో శనివారం గ్రాండ్ పేరెంట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి హాజరై మాట్లాడారు. ధర్మవరం గౌతమ్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ నాగరాజు పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

రుద్రవరం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్.నాగులవరం గ్రామ సమీపంలో ఇద్దరు వ్యక్తుల నుంచి 38 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు. శనివారం ఆర్.నాగులవరం గ్రామానికి చెందిన ప్రహ్లాదుడు, దస్తగిరిలు మద్యం సీసాలు అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం అందడంతో ఎస్ఐ దాడి చేసి, వారిని అదుపులోకి తీసుకుని 38 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దసరా ఉత్సవాలకు మంత్రి బీసీకి ఆహ్వానం



మంత్రి బీసీకి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆర్యవైశ్యులు

బనగానపల్లె, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె కొండపేటలో జరిగే దసరా ఉత్సవాలకు హాజరు కావాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని శనివారం రాత్రి ఆర్యవైశ్యులు ఆహ్వానించారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలసి ఆర్యవైశ్య సంఘం నాయకులు శాలువాతో సత్కరించి ఆహ్వాన పత్రిక అందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు గాధంశెట్టి వేణుగోపాల్, శ్రీరామ వెంకట సుబ్రహ్మణ్యం, టంగుటూరు శ్రీనయ్య, నూకల సుబ్బయ్య, నూకల విజయకుమార్, గుండా రవికుమార్ పాల్గొన్నారు.

దసరా వేడుకలకు హాజరుకావాలి



ఎమ్మెల్యే కోట్లకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ ఈవో

బేతంచెర్ల, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి స్వామి, మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో జరిగే దసరా శరన్నవరాత్రుల వేడుకలకు హాజరు కావాలని కోరుతూ డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి ఆలయ ఈవో రామాంజనేయులు ఆహ్వాన పత్రికను శనివారం అంద జేశారు. డోన్ పట్టణంలోని ఎమ్మెల్యే కోట్ల స్వగృహంలో మద్దిలేటి స్వామి, ఆలయ ఈవో రామాంజనేయులు ఎమ్మెల్యే కోట్లకు ఆహ్వాన పత్రికను అందజేశారు.

బ్రహ్మోత్సవాలకు బీసీ రాజారెడ్డికి ఆహ్వానం



బీసీ రాజారెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నందవరం ఈవో

బనగానపల్లె, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో ఈనెల 22 నుంచి దేవి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని నందవరం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డిలు శనివారం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దంపతులతోపాటు బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డిని శనివారం ఆహ్వానించారు. వారి వారి కార్యాలయాల్లో ఈవో, పీవీ. కుమార్‌రెడ్డిలు స్వయంగా మంత్రి బీసీని , మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డిని వారి కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు ప్రదీప్‌స్వామి, టీడీపీ నాయకులు నుసి లక్ష్మిరెడ్డి, బోయ వెంగన్న పాల్గొన్నారు.